# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక







సంపుటి : 01 | సంచిక : 11 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 07 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | పేజీలు : 5/-




## ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి

# నల్లగొండకు నీళ్లిస్తాం..

- కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోకుండా నిర్లక్ష్యం
- ప్రజలను పట్టించుకోకుండా నిరంకుశంగా పాలన
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు
- దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం
- పేదలకు 4.50లక్షల ఇళ్లు మంజూరు చేశాం
- దేవరకొండ సభలో సీఎం రేవంత్



**దేవరకొండ, మన చౌరాస్తా :** గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులను పండబెట్టారని, ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎస్ఎల్‌బీసీను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు, నిర్లక్ష్యం చేశారు. ఎస్ఎల్‌బీసీ ఆగిందని మామ, అల్లుడు డ్యాన్సులు చేస్తున్నారు. ఎవరూ అడ్డుపడ్డా ఎస్ఎల్‌బీసీను పూర్తిచేసి తీరుతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో రూ.23 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. పోరాటాల పౌరుషం ఉన్న గడ్డ నల్గొండ. నిజాం నిరంకుశ పాలనను ఎదురించిన జిల్లా నల్గొండ. ప్రజా ప్రభుత్వానికి అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు అని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది. రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఆకలి తీర్చినప్పుడే నిజమైన ఇందిరమ్మ రాజ్యం అని మన ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తోంది. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. గుజరాత్ సహా దేశంలో మరే రాష్ట్రంలోనూ సన్న బియ్యం ఇవ్వట్లేదు. యూపీఏ ప్రభుత్వ హయాములో రాష్ట్రంలో 25లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరిగింది. గత పదేళ్లలో ఎంతమంది పేదలకు ఇళ్లు ఇచ్చారో కేసీఆర్ చెప్పాలి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 4.50లక్షల ఇళ్లు పేదలకు మంజూరు చేశాం. లంబాడీలకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించిందే ఇందిరమ్మ ప్రభుత్వం.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 25లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసింది. ఒకే విడతలో రూ.2లక్షల చొప్పున రూ.21వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. రుణమాఫీ పేరిట పదేళ్లపాటు రైతులను కేసీఆర్ మోసం చేశారు.


..:: మిగతా 2లో




## పారదర్శకంగా పంచాయతీ

# ఎన్నికలు

- ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్
- జనగామ ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- మైక్రో అబ్జర్వర్లకు పత్రేక్య శిక్షణా కార్యక్రమం


2







# పారదర్శకంగా పంచాయతీ ఎన్నికలు

- **ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్**
- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల సాధారణ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణం లో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్ , జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మైక్రో అబ్జర్వర్ల కు సూచించారు. శనివారం జిల్లా IDOC కార్యాలయంలో మైక్రో అబ్సర్వర్ లకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని జనరల్ అబ్జర్వర్ రవి కిరణ్, స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పలు సూచనలను తెలిపారు. ఎన్నికలను పారద ర్శకంగా నిర్వహించడం లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని, నైతికంగా వ్యవహరిస్తూ.. ఎలాంటి పక్షపాతం లేకుండా వ్యవహరించాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు తమ చెక్లిస్టో ప్రతి అంశంపై “అవును/కాదు” గా నమోదు చేసి, గమనించిన లోపాలు లేదా సంఘటనలను ప్రత్యేక రిపోర్టో పొందుపరచాలన్నారు. పోలింగ్ స్టేషన్లో బ్యాలట్ బాక్సు్ల సరైన విధంగా ఫిక్స్ చేయాలని ఎంట్రీ పాస్ సిస్టమ్ను కచ్చితంగా అమలు చేయలన్నారు. ఓటరు గుర్తింపు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చేయాలన్నారు. ఇండెలిబుల్ ఇంక్ సరైన విధంగా అప్లై చేయడం, బ్యాలెట్ పేపర్ కౌంటర్ ఫాయిల్లో ఓటర్ వివరాలు నమోదు, పోలింగ్లో రహస్యత్వం పూర్తి స్థాయిలో నిర్ధారించాలన్నారు. పోలింగ్ ఏజెంట్ల ప్రవర్తన, వారి ఫిర్యాదులపై తక్షణ చర్య, గ్రామపంచాయతీ కౌంటింగ్ సెంటర్లో ఏర్పాట్లు పరిశీలించడం, కౌంటింగ్కు సంబంధించిన ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం, ఫలితాల ప్రకటన, ఎన్నిక సర్టిఫికేట్ జారీ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. జనరల్ అబ్జర్వర్ రవికిరణ్ మాట్లాడుతూ పోలింగ్ ఏజెంట్ల హాజరు, వారి కార్యకలాపాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలు పాటించాలన్నారు. పోలింగ్ స్టేషన్లో అనవసర రద్దీ లేకుండా యాక్సెస్ నియంత్రణ కౌంటింగ్ ప్రక్రియలో పారదర్శకత, వీడియో రికార్డింగ్, ప్రోటోకాళ్ల అనుసరణ ఫలితాల ప్రకటనా విధానం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఫలితాల అనంతరం నిర్వహించే ఉపసర్పంచ్ ఎన్నికను తెలంగాణ పంచాయతీ రాజ్ నియమాల ప్రకారం పర్యవేక్షించాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు తప్పనిసరిగా పోలింగ్ టీమ్లతో కలిసి పోలింగ్ స్టేషన్లు ,రిసెప్షన్ సెంటర్లు సమయానికి చేరుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్లో పోలింగ్కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అన్నది జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఏ పరిస్థితుల్లోనూ మైక్రో అబ్జర్వర్లు ప్రెసైడింగ్ ఆఫీసర్ లేదా పోలింగ్ ఆఫీసర్ పాత్రలో వ్యవహరించకూడదన్నారు. పోలింగ్ ఏజెంట్లు సక్రమంగా హాజరయ్యారా, వారు ఎన్నికల సంఘం (ECI/SEC) మార్గదర్శకాలు పాటిస్తున్నారా అన్నది పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమం లో జడ్పీ సీఈఓ మాధురి షా, ఇంచార్జ్ డి పి ఓ వసంత పాల్గొన్నారు.

## అంబేద్కర్‌కు నివాళి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్రావు రామ్‌జీ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా నేడు భీమదేవర పల్లి మండలంలోని అంబేద్కర్ కూడలి వద్ద తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నివాళుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ ఎల్తూరి ప్రేమ్‌రాజ్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ ప్రత్యేకంగా పాల్గొన్నారు.

డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అంబేద్కర్ సంఘం నాయకులు, ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం మాట్లాడిన తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ మన దేశంలో ప్రజలకు ఓటు హక్కు లభించడం, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, బంధుత్వం వంటి రాజ్యాంగ ముఖ్య విలువలు అందరికీ అమలులో ఉండటం వెనుక డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నిరంతర కృషి ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, రాష్ట్ర కార్యదర్శి కండె సుధాకర్, జిల్లా అధ్యక్షుడు గొర్రె థామస్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి, వేముల జగదీశ్, కండె చిరంజీవి, తాళ్లపెల్లి ఐలయ్య, కనకం వెంకట్, పచ్చునూరి సదానందం, శ్రీనివాస్, వీరస్వామి, గొర్రె తిరుపతి పాల్గొన్నారు.





## మల్లన్న కల్యాణోత్సవ ఏర్పాట్లు పరిశీలన సిద్దిపేట కలెక్టర్

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ కే ఐమావతి శనివారం పరిశీలించారు. ఈనెల 14న జరగనున్న కళ్యాణోత్సవానికి సంబంధించిన పనులను, 50 గదుల సత్రం నిర్మాణం, ఐనాపూర్ రోడ్డు నుంచి చేర్యాల బైపాస్ రోడ్డు పనులను తనిఖీ చేశారు. దేవాలయ కార్యనిర్వాహణాధికారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, దేవాదాయ, పోలీస్ శాఖలతో పాటు. జిల్లా అధికారుల పాల్గొన్నారు.



## సీపీఎం బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి : ఆముదాల మల్లారెడ్డి

**కొమరవెల్లి, మన చౌరస్తా :** సర్పంచ్ ఎన్నికల్లో సీపీఎం బలపర్చిన అభ్యర్థలను గెలిపించాలని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి తాడూరి రవీందర్ అధ్యక్షత వహించగా మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పోటీ చేస్తున్న సిపిఎం పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని, ఎల్లప్పుడు గ్రామాల్లో ఉన్న సమస్యలపై ప్రజలకు ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించడంలో నిజాయితీగా ముందుంటారని తెలిపారు. ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి సంక్షేమ పథకాలు అర్హులను గుర్తించి ప్రజాక్షేత్రంలోనే సంక్షేమ పథకాలు ఇప్పించడంలో ముందు భాగాన నిలబడతారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు అత్తిని శారద, మండల కమిటీ సభ్యులు తేలు ఇస్తారీ, ఒల్లంపల్లి సాయిలు, నీల బిక్షపతి, తాడూరు మల్లేశం, ఆరుట్ల రవీందర్, కానుగుల రాజు, సున్నం యాదగిరి, కర్రోళ్ల ఎల్లయ్య, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



## రామప్పను సందర్శించిన హైకోర్టు జడ్జి

**ములుగు, మన చౌరాస్తా :** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని పాలంపేట గ్రామంలో గల ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని శనివారం హై కోర్టు జడ్జి ఈవి వేణుగోపాల్ సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు హరీష్ శర్మ ఉమా శంకర్లు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ మండపంలో వారిని ఈవో బిల్లా శ్రీనివాస్ శాలువాలతో సత్కరించారు. ఆలయ విశిష్టతను టూరిజం గైడ్ గోరంట్ల విజయకుమార్ వివరించారు వారి వెంట ములుగు భూపాలపల్లి జిల్లా జడ్జిలు సూర్య చంద్రకళ, రమేష్ బాబు, సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్య లాల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జోత్స్న, దిలీప్ నాయక్, తహసీల్దార్ గిరి బాబు, సిఐలు సురేష్, ఎస్సై చల్ల రాజు, ఈవో శ్రీనివాస్, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది, పోలీస్, రెవిన్యూ, దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది, టూరిస్ట్ పోలీసులు తదితరులు ఉన్నారు.

## ఎన్నికల విధులు చాలా కీలకం



**జనగామ, మన చౌరాస్తా :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ లో భాగం గా లింఘాల ఘనపుర్ మండలం బండ్లగూడెం రైతు వేదిక లో పి ఓ లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించి.. పలు అంశాల మీద పి ఓ లకు కలిగిన అవగాహన ను కలెక్టర్ స్వయం గా ప్రశ్నలు అడిగి పరీక్షించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమలు జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం తెలిపారు. మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నందున, చివరి దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు.

# నల్లగొండకు నీళ్లిస్తాం..


(మొదటి పేజీ తరువాయి)

గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా కేసీఆర్ కలిసేవారు కాదు. ప్రగతి భవన్, ఫామ్‌హౌజ్‌లోకి ఎవ్వరినీ రానివ్వలేదు. కానీ, నిన్న ఇద్దరు సర్పంచ్‌లను కూర్చోబెట్టుకుని మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని చెబుతున్నారు. కేసీఆర్ ఓడిపోయాకే రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఎస్ఎల్‌బీసీ పనులు ప్రారంభించగానే సొరంగంలో దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగింది. సొరంగంలో ప్రమాదం జరిగితే భారత రాష్ట్ర సమితి నేతలు సంబరపడ్డారు. ఏదేమైనా టన్నెల్‌ను పూర్తి చేసి నీరు అందిస్తాం‘ అని సీఎం అన్నారు.

తమ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా పాలన సాగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన రెండేళ్లు పూర్తిచేసుకుంటున్నామని పేర్కొన్నారు. నిజాంలు, రజాకార్లను తరిమికొట్టిన ప్రాంతం నల్గొండ అని చెప్పుకొచ్చారు. గడీల పాలనను ప్రజలు తరిమికొట్టారని ప్రస్తావించారు. కేసీఆర్ హయాంలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలనే ఆలోచనే చేయలేదని విమర్శించారు.

పేదలందరికీ తమ ప్రభుత్వంలో రేషన్ కార్డులు ఇచ్చామని స్పష్టం చేశారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించారు సీఎం రేవంత్‌రెడ్డి.

’కేసీఆర్ హయాంలో పేదలకు దొడ్డుబియ్యం ఇచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వట్లేదు. మా హయాంలో సన్నబియ్యం సరఫరా చేస్తున్నాం. పేదల ఆకలి తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని మాట ఇచ్చి కేసీఆర్ మోసం చేశారు. యూపీఏ హయాంలో తెలంగాణలో 25 లక్షల ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పుడు తెలంగాణ లో 4 లక్షలకు పైగా ఇళ్లు కడుతున్నాం. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో చెప్పాలి. కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం జరగుతుంది. కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ ఉండదన్నారు. 24 గంటలపాటు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత మాదే. ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్‌దే. పేదలంటే కేసీఆర్‌కు ఇష్టం ఉండదు. రైతులను కేసీఆర్ మోసం చేశారు’ అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ’మంచి రోజులు వస్తాయని కేసీఆర్ అంటున్నారు. పదేళ్ల దోపిడీ ఇంకా చాల్లేదా కేసీఆర్?. ఆయన మళ్లీ అధికారంలోకి వస్తే మనల్ని ముంచే రోజులొస్తాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బండకేసి కొట్టింది గుర్తులేదా..? అయిన.. మీ కుమారుడే మీకు పెద్ద గుదిబండ. కేటీఆర్ ఉన్నంతకాలం బీఆర్ఎస్‌ను ప్రజలు బండకేసి కొడుతూనే ఉంటారు. కేసీఆర్ ఓడిపోయాకే ప్రజలకు మంచి జరిగిందని.. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలనూ కలవలేదు. ఫామ్‌హౌస్, ప్రగతి భవన్‌కు ఎవరినీ రానివ్వలేదు. ఇప్పుడు సర్పంచ్‌లు, వార్డు మెంబర్లనూ కలుస్తున్నారు. యువతకు 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. భవిష్యత్‌లో మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు సభలో పాల్గొన్నారు.



## సీపీఐ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..

**జనగామ, మన చౌరాస్తా :** నర్మెట మండలం కన్నెబోయిన గూడెంకు చెందిన సీపీఐ నాయకులు శనివారం బీఆర్ఎస్లో చేరారు. జనగామలోని క్యాంపు ఆఫీస్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని సూచించారు. చేరిన వారిలో సీపీఐ గ్రామ శాఖ అధ్యక్షుడు కాటబోయిన కృష్ణమూర్తి, కాంగ్రెస్ బీసీ యువ నాయకులు రాజబోయిన రమేష్, ముదిరాజ్ నాయకులు కాటబోయిన సిద్దులు, రాజబోయిన శ్రీశైలం, డిండిగాల మల్లయ్య, పండుగ లింగం ఉన్నారు.

## శ్రీసోమేశ్వర్ ఆలయంలో ములుగు కలెక్టర్ పూజలు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తిలో ని పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ కు ఆలయ అర్చకులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు, అనంతరం స్వామి వారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించి, ప్రసాదం అందజేశారు.ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ఆలయ ప్రధాన అర్చకులు దేవగిరి లక్ష్మన్న, అర్చకులు డివిఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజం నాగరాజు, ఆలయ సిబ్బంది రమేష్, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.



# అంబేద్కర్ ఆశయసాధనకు కృషి చేద్దాం

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి
- అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించిన నేతలు



**జనగామ, మన చౌరాస్తా :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడూత అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలు సమాజంలో మరింతగా ప్రాచుర్యం పొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అంబేద్కర్ సంఘాలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బచ్చన్నపేటలో..

**బచ్చన్నపేట, మన చౌరస్తా :** ప్రపంచ మేధావి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతిని బచ్చన్నపేట మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఉపాధ్యక్షులు మల్యాల బాల నరసయ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం అనునిత్యం పోరాడి అందరూ సమానత్వంగా ఉండాలని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించిన మహా మేధావి అంబేద్కర్ అని అన్నారు. ఆయన చేసిన పనులను గుర్తించి ఐక్యరాజ్యసమితి ప్రపంచంలోనే మనుషులను ప్రభావితం చేసే వ్యక్తి అని కొని ఆడారు రాజ్యాంగ రక్షణకై ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెరుమల యాదగిరి. రిటైర్డ్ ఉపాధ్యాయులు మంచాల వెంకటయ్య. తేలు కంటి శ్రీనివాస్. పంబాల మల్లేష్.సనాది క్రాంతి కుమార్. కక్కర్ల గణేష్. మల్యాల హరికుమార్. కామిడి సిద్ధారెడ్డి.నవీన్. ఎండి షాప్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



### మద్దూరులో..

**మద్దూరు మన చౌరాస్తా :** సీపీఎం మద్దూరు మండల కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి, మండల కార్యదర్శి ఎండి షఫీ, మండల కమిటీ సభ్యులు అల్ల రమేష్, పిట్టల నరేష్, నాయకులు పిడిశెట్టి రాజు, శ్రీకాంత్, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



### కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రామడుగు బాలరాజు, దాసరి పద్మరెడ్డి, ఇప్ప నిషికాంత్ రెడ్డి, సుందరగిరి సత్యనారాయణ, పులా కనకయ్య, నాగమణి రాజు, కాసర్ల రేణుక కనకరాజు, ఇసాక్, మాచర్ల ఆశిష్, అశోక్, రాములు, బాలయ్య సిద్దయ్య, ఎల్లయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి


### రిటైర్డ్ కెప్టెన్ డాక్టర్ లింగాల పాండు రంగారెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని దేశ రక్షణకు అంకితం కావాలని రిటైర్డ్ కెప్టెన్ డాక్టర్ లింగాల పాండురంగారెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. జనగామ పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ శీకటి సునంద ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జనగామ జిల్లా దేవరుప్పల మండలం నీర్మల గ్రామానికి చెందిన రిటైర్డ్ కెప్టెన్ డాక్టర్ లింగాల పాండురంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తు కోసం ఇంగ్లీష్ విద్యపై పట్టు సాధించి పుస్తక పఠనంపై ఆసక్తి కనబరచాలని కోరారు. విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు ఎన్డీఏ, సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు మార్గాలను ఏర్పరుచుకోవాలని సూచించారు. విద్యార్థులు టీవీలు చూడడం సెల్ఫోన్ వంటి పరికరాలకు దూరంగా ఉండి చదువు పట్ల శ్రద్ధ కనబరిస్తే ఉన్నత శిఖరాలకు చేరతారన్నారు. జాతీయస్థాయి పోటీ పరీక్షలలో తెలంగాణ





విద్యార్థులు ఎక్కువగా పాల్గొని తెలుగువారి సత్తా చాటాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ సునంద మాట్లాడుతూ జాతీయస్థాయిలో మిలటరీలో ఉన్నత స్థానంలో ఉద్యోగం చేసిన డాక్టర్ లింగాల పాండురంగారెడ్డి కళాశాలను సందర్శించి విద్యార్థులకు సలహాలు సూచనలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జనగామ జిల్లా దేవరుప్పల మండలం నిర్మల గ్రామంలో జన్మించి మిలటరీలు సుదీర్ఘకాలంపాటు దేశ సేవకు అంకితం అయిన వ్యక్తులు తమ కళాశాలను సందర్శించడం శుభసూచకం అన్నారు. డాక్టర్ లింగాల పాండురంగ రెడ్డి గారు తన రిటైర్మెంట్ అనంతరం కూడా ఇంటర్ విద్యా బలోపేతానికి సెంటర్ హెడ్, సెంట్రల్ ఆఫ్ తెలంగాణ మరియు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సమాజాభివృద్ధికి తమ సేవలను అందించడం జనగామ జిల్లాకే గర్వకారణం అన్నారు.ఈ సందర్భంగా కళాశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు అధ్యాపకేతర బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# మల్లన్న క్షేత్రానికి త్రిశక్తి పీఠం పీఠాధిపతులు ఆదిత్య పరాశ్రీ రాక



**కొమురవెల్లి, మన చౌరస్తా :** సామాజిక సేవకులు గణేష్ తివారి నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం బిజ్వార్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ అంబాత్రయ క్షేత్రంలోని శ్రీ కాళీ, శ్రీ సరస్వతి, శ్రీలక్ష్మి అమ్మవార్లను శనివారం అయ్యప్ప స్వామి భక్తులతో కలిసి దర్శించుకున్నారు. త్రిశక్తి పీఠం పీఠాధిపతులు డాక్టర్ ఆదిత్య పరాశ్ీ స్వామి వారిని కలిసి కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి ఆలయానికి మరియు చేర్యాల మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయానికి రావాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. డాక్టర్ ఆదిత్య పరాశ్రీ వారు త్వరలోనే కొమురవెల్లికి, చేర్యాల అయ్యప్ప స్వామి ఆలయానికి రానున్నారని గణేష్ తివారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చేర్యాల మండలకేంద్రంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయానికి చేరుకొని స్వామివారి దర్శనం అనంతరం ఆదిత్య పరాశ్రీ స్వామి వారు భక్తులతో మాట్లాడుతారని తెలిపారు.



## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన

# కొమరవెల్లి నాయకులు

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కేంద్ర బొగ్గు గనుల శాఖ కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డిని కొమురవెల్లి బీజేపీ నాయకులు హైదరాబాద్లో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సర్పంచ్, వార్డ్ మెంబర్ల ఎన్నికల అభ్యర్థులకు సంబంధించిన వివరాలు ఆయనకు వివరించారు. సంక్రాంతికి నూతనంగా ప్రారంభోత్సవం కానున్న కొమురవెల్లి మల్లికార్జున రైల్వే స్టేషన్ పనులను వివరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. జాతర సమయంలో మూడు నెలలపాటు స్థానిక వర్తక వ్యాపార వర్గాలు మరియు వివిధ ప్రాంతాల నుండి దర్శనార్థం వస్తున్న మల్లన్న భక్తులు మొబైల్ కమ్యూనికేషన్ వ్యవస్థ వలన ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వివరించగా కొమురవెల్లిలో మొబైల్ ఆపరేటర్లకు మెరుగైన కమ్యూనికేషన్ ఉండేలా చూడాలని కేంద్ర మంత్రి ఆపరేటర్లకు ఆదేశాలు జారీ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు బూర్గోజు స్వరూప, మండల ప్రధాన కార్యదర్శి ఎక్కల్ దేవి శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఎక్కల్ దేవి మధు, బూర్గోజు నాగరాజు, పాశం భరత్ తదితరులు పాల్గొన్నారు.

# సాయిఈశ్వర్‌కు ఘన నివాళి

**జనగామ, మన చౌరాస్తా :** బీసీ హక్కుల కోసం, 42 శాతం రిజర్వేషన్ కోసం ఆత్మత్యాతం చేసుకున్న అనుమల సాయి ఈశ్వర్కు నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సాయి ఈశ్వర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ జనగామకు చెందిన పలువురు నాయకులు ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. అఖిల భారత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కవులే జగన్నాథం, దరువు అంజన్న, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు మద్దోజు గంగాభవానీ, పట్నాల సావిత్రి, దిగోజు శ్రీలక్ష్మి పాల్గొన్న వారిలో ఉన్నారు.



# మైనార్టీల హక్కులను రక్షించాలి



**జనగామ, మన చౌరాస్తా :** ముస్లిం మైనారిటీ డెవలప్మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ. జమాల్ షరీఫ్ ఆధ్వర్యంలో బాబ్రీ మసీదు కూల్చివేత దినమైన డిసెంబర్ 6 (బ్లాక్ డే) సందర్భంగా జామియా మసీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మైనారిటీ హక్కులను కాపాడాలని జనగామ జిల్లా కలెక్టరేట్లో ఇంచార్జి ఏవో శ్రీకాంత్కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఎండి మసి ఉర్ రెహమాన్, ఎండి నూరుద్దీన్, మౌలానా షాకీర్ హుస్సేన్, ఎండి సాదిక్ అలీ, అబ్దుల్ మన్నాన్ రజి, జహీర్, సలీం, చాంద్, గౌస్, బషీర్, నసీర్, అక్బర్, మదర్ తదితర ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



# ప్రవాసీల హక్కులు రక్షణ ఏదీ?

ప్రవాసీ భారతీయుల హక్కులు, భద్రత, సంక్షేమం వంటి అత్యంత కీలకమైన అంశాలను ప్రభావితం చేసే ఓవర్సీస్ మొబిలిటీ (విదేశీ వలస) బిల్-2025 రూపకల్పన దశలో ఉన్న పరిస్థితుల్లో, ప్రవాసుల స్వరాన్ని నిజంగా ప్రతిబింబించేలా ఈ చట్టం ఉండాలని తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యుడు చెన్నమనేని శ్రీనివాసరావుతో కూడిన ప్రతినిధి బృందం ఢిల్లీలో గురువారం తెలంగాణకు చెందిన ఏడుగురు పార్లమెంటు సభ్యులను కలిసి వినతిపత్రాలు సమర్పించింది. నాలుగు దశాబ్దాలుగా అమలులో ఉన్న ఎమిగ్రేషన్ యాక్ట్-1983 స్థానంలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర మార్పులు ప్రతిపాదిస్తున్న సందర్భంలో, విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లే లక్షలాది మంది వలస కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగు పడేలా, వారి హక్కులు రక్షితంగా ఉండేలా బిల్లు వుండాలని ప్రతినిధులు స్పష్టం చేశారు. భారతీయ వలస కార్మికులు విదేశాల్లో గౌరవంగా, భద్రతతో, శ్రమ విలువ కనుగుణంగా జీవించే అవకాశాలను ప్రభుత్వం మరింత బలోపేతం చేయాలని కోరారు.విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్థాండింగ్ కమిటీ సభ్యురాలు, బీజేపీ ఎంపీ డీకే అరుణ, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కెఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, సురేష్ షెట్కార్, డా. కడియం కావ్య, గడ్డం వంశీక్రిష్ణ, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ మధు యాష్కీ లతో జరిగిన చర్చల్లో బిల్లు రూపకల్పనలో తొలగింప బడిన అనేక రక్షణా నిబంధనలను వారు స్పష్టంగా ప్రస్తావించారు. 2021 ముసాయిదాలో ఉన్న అనేక హామీలు, రక్షణలు ప్రస్తుత ప్రతిపాదనలో లేవని, అధికారం కేంద్రీకృతమయ్యే విధానం వలస కార్మికులపై దోపిడీ ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని భీంరెడ్డి, శ్రీనివాసరావులు వివరించారు. వలస కార్మికులు నేరుగా కోర్టులను ఆశ్రయించే హక్కు తొలగించడం, మహిళలు%-%పిల్లల రక్షణలకు ప్రత్యేక నిబంధనలను 'సున్నిత వర్గాలు' అంటూ అస్పష్టమైన శీర్షికలో విలీనం చేయడం, రిక్రూట్మెంట్ ఏజెన్సీలు వసూలు చేసే ఫీజుల వివరాలను వెల్లడించే నిబంధన తొలగించడంతో రుణబానిసత్వం పెరుగే ప్రమాదం, విదేశాలకు పంపించిన అనంతరం ఏజెన్సీల బాధ్యతను పరిమితం చేయడం, విదేశాలనుంచి తిరిగివచ్చిన వారికి ఉండే పునరేకీకరణ వ్యవస్థ బలహీనపడటం, ఆరు నెలల లోపు డిపోర్ట్ అయిన వారిని 'రిటర్నీలు'గా పరిగణించక పోవడం వంటి అంశాలు ప్రవాసుల హక్కులను గణనీయంగా బలహీన పరుస్తాయని వారు గుర్తుచేశారు. 'ఎమిగ్రంట్', 'ఓవర్సీస్ ఎంప్లాయ్‌మెంట్', 'లేబర్' వంటి కీలక పదాల నిర్వచనాల్లో విద్యార్థులు, ఆధారితులు, డిజిటల్ కార్మికులు వంటి వర్గాలను బయటకు నెట్టడం, మానవ అక్రమ రవాణాకు స్పష్టమైన నిర్వచనం లేకపోవడం, కేంద్రీకృత పాలనా విధానంలో రాష్ట్రాలకు, కార్మిక సంఘాలకు, హక్కుల సంస్థలకు ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం వల్ల సమస్యల పరిష్కారం దూరమవుతుందనే ఆందోళనలు ప్రతిపాదించారు. ముఖ్యంగా ప్రతిపాదిత 'ఓవర్సీస్ మొబిలిటీ అండ్ వెల్ఫేర్ కౌన్సిల్'లో వలస కార్మికులను విదేశాలకు పంపే రాష్ట్రాలకు చోటు లేకపోవడం తీవ్రమైన లోపమని పేర్కొన్నారు. ఎమిగ్రేషన్ చెక్‌పోస్టులు రద్దు చేసినప్పటికీ ప్రత్యామ్నాయ నియంత్రణ వ్యవస్థ లేకపోవడం, ప్రయాణానికి ముందు శిక్షణా ప్రమాణాలు, విదేశాలలో అందించాల్సిన సహాయక సేవలు స్పష్టంగా లేకపోవడం, ఇంటిగ్రేటెడ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ హక్కుల కంటే పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం, 24/7 హెల్ప్‌లైన్‌లు, విమానాశ్రయం%-%ఎంబసీ సహాయం తప్పనిసరి అంశాలుగా ప్రతిపాదించక పోవడం, శిక్షలు కేవలం రిక్రూట్మెంట్ ఏజెంట్లపైనే ఉండటం, విదేశీ యజమాన్యాలపై చర్యలేమీ లేకపోవడం, అక్రమ ఆన్‌లైన్ రిక్రూట్మెంట్, ట్రాఫికింగ్ నియంత్రణకు ప్రత్యేక నిబంధనలు లేకపోవడం, విధించే జరిమానాల్లో బాధితులకు పరిహారాన్ని కేటాయించక పోవడం వంటి అంశాలు కూడా వారి ప్రాతినిధ్యం వహించిన కోరల్లో భాగమయ్యాయి. ఇవన్నీ కలిపి చూస్తే బిల్లులో ప్రవాసీ కార్మికుల సంక్షేమం బలపడటానికి కాకుండా బలహీన పడే అవకాశం ఎక్కువగా ఉందని వారు ఎంపీల దృష్టికి తీసుకెళ్లారు. విదేశాల్లో భారతీయుల భద్రత, గౌరవం, జీవనోపాధి, రక్షణ వ్యవస్థలపై ఎటువంటి సందిగ్ధత లేకుండా చట్టం రూపొందించాలంటే ప్రస్తుత బిల్లును లోతుగా అధ్యయనం చేసి అవసరమైన సవరణలు చేయడం అత్యంత అవసరమని ప్రతినిధి బృందం స్పష్టం చేసింది. వలస కార్మికుల హక్కులను కాపాడుతూ, దోపిడీని అరికట్టుతూ, రాష్ట్రాల సహకారంతో సమన్వయపూర్వక వ్యవస్థను ఏర్పాటు చేసే విధంగా బిల్లు రూపుదిద్దుకోవాలని వారు కోరారు.

# తెలుగు సినీ జగత్తులో మహానటి



సినిమా హాల్లో తెర వెలిగిన క్షణం, కథ మొదలుకాకముందే మన హృదయాల్లో మొదట వెలిగేది సావిత్రి కళ్ల మెరుపే. ఆమె పాత్రలో నటించలేదు.. జీవించింది. నవ్వు, బాధ, అమాయకత్వం, బలహీనత.. ప్రతీ భావానికీ ఆమె కళ్లే అక్షరాలు. సినిమా ఆమెకు వృత్తి కాదు.. స్వయం ఆవిష్కరణ. తెర కరిగినా కాలం గడిచినా, సావిత్రి మాత్రం మన జ్ఞాపకాల అద్దంలో శాశ్వతంగా నిలిచిపోయిన శ్వాస. సినిమా హాలులో తెర వెలిగిందంటే మొదట వెలిగే మెరుపు సావిత్రి కళ్లది, కథ మొదలవకముందే ఆమె కళ్లలోని నవ్వులు, వేదనలు మన గుండెల్లో చోటు చేసుకున్నాయి. పాత్రల్ని ఆమె ధరించలేదు, ఆమె ఆ పాత్రగా శ్వాసించింది. 'మాయాబజార్‌లో చిరునవ్వు మన పండుగల దివిటీ. 'మిస్సమ్మ లో నడక మన పెరట్లో మనం జారి పడకుండా మన చిన్నప్పుడు అమ్మ పట్టుకున్న చేయి. దుఃఖం ఆమెకు అలంకారం కాదు జీవితపు నిజం. ఆమె కళ్లలో ప్రతి నీడ స్త్రీ ఓర్పు, మౌనం, పగలు రాత్రి.. తెరకరిగిపోయినా, కాలం దూరమైనా, సావిత్రి ఇంకా మనలో ఉంది. సావిత్రి తెరపై కాదు, మన జ్ఞాపకాల అద్దంలో నిలిచిపోయిన శ్వాస. నాకయితే స్కీన్ ప్రజెన్స్‌లో స్మితాపాటిల్ తర్వాతి స్థానం సావిత్రిదే. నటిగా ఆమెది గొప్ప భావస్ఫోరకమయిన ముఖం. పాత్రల భావాల్ని వ్యక్తీకరించడంలో ఆమె చూపిన ప్రతిభ స్మితాపాటిల్, మీనాకుమారి లాంటి కొద్దిమందికే సాధ్యమయింది. సావిత్రి తన కళ్లతో ప్రకటించిన భావాలు గులాబీలు విచ్చుకున్నంత సహజంగానూ, పరిమళాలు విస్తరించినంత హాయిగానూ ఉంటాయి. ఇక సావిత్రి మూతి విరుపులో ఆమె చూపిన విన్యాసం ఎన్నో భావాల్ని అలవోకగా ఆవిష్కరించేవి. నటించింది 80 పైచిలుకు సినిమాలే అయినప్పటికీ ఆనాటి తెలుగు తమిళ ప్రేక్షకుల్లో చిరస్థాయిగా సావిత్రి నిలిచిపోయింది. నటనే తన జీవితం అనుకుంది కానీ జీవితంలో నటించలేక సావిత్రి గెలిచి ఓడింది, ఓడి గెలిచింది.

అందగత్తెగా రెండు భాషల ప్రేక్షకుల మనస్సులో సావిత్రి స్థానం సుస్థిరం. మహానటిగా ఆమె అభినయం అజరామరం. కొమ్మారెడ్డి సావిత్రిని ఏదో ఒక చిత్రం తోనో ఒక రకం పాత్రల తోనూ గుర్తుంచుకోలేం. తన పాత్రల నిర్వహణలో చూపిన వైవిధ్యం అద్భుతమైంది. భావి తరాల నటులకు ఆమె ఒక మోడల్. సంభాషణలు చెప్పడంలో ఆమె చూపిన సరళత్వం, భావ ప్రకటనలో కనిపించే సహజత్వం ఆమె సొంతం. మూతి విరిచినా, వెక్కిరించినా, సంతోషమైనా, దుఃఖమైనా, అమాయక పాత్ర అయినా, చలాకీ పాత్ర అయినా సావిత్రి, సావిత్రి అభినయం విస్తృతమయింది. పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేయడం ఆమె ప్రత్యేకత. అలవోకగా కనిపించడం నటిగా ఆమె సాధించిన విజయం. మిస్సమ్మ, బతుకుతెరువు, దేవదాసు, అర్ధాంగి, దొంగరాముడు, మాయాబజార్, మాంగల్యబలం, నర్తనశాల ఇట్లా సాంఘిక, పౌరాణిక ల్లాంటి అనేక జానర్లల్లో ఆమె ఒదిగిపోయింది. వతీ •తీ• అ ••తీ ఎశీతీవ •ష్ట్ర•అ •ష్ట్రవ •తీ•. సావిత్రి నిజానికి తన జీవితంలో ఎదుర్కొన్న సంక్లిష్టతలను దుఖాలను, స్వీకరించి వాటిని కళగా మార్చి నటిగా నిరూపించుకుంది. 1935 డిసెంబర్ ఆరో తేదీన సావిత్రి కృష్ణా జిల్లా చిర్రావూరులో జన్మించింది. ఆర్థికంగా మెరుగైన కుటుంబంలో జన్మించిన సావిత్రి తన అక్షరాభ్యాసంతో పాటు నృత్యంలో కూడా ప్రవేశించింది. 1950లో గోపాలకృష్ణా పంపిణీ సంస్థకు చెందిన కృష్ణమూర్తి ప్రేరణతో సావిత్రి పెదనాన్న తోడుగా మద్రాస్ చేరుకొని సినిమా ప్రయత్నాలు మొదలు పెట్టింది. సావిత్రి తన నటన ప్రతిభను నిరూపించుకోవడానికి నృత్యరూపకుడూ, దర్శకుడూ అయిన వేదాంతం రాఘవయ్య దర్శకత్వం వహించిన 'దేవదాసు' సినిమా సమున్నతంగా నిలిచింది. అదే సమయంలో 'పల్లెటూరు', 'మేనరికం', 'సంక్రాంతి', 'ప్రతిజ్ఞ', 'చంద్రహారం', 'బ్రతుకుదెరువు', 'జ్యోతి' తదితర సినిమాలు పరంపరగా వచ్చాయి. ఇక ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో మిస్సమ్మలో మొండితనం, వ్యక్తిత్వం వున్న మేరీ పాత్రతో సావిత్రి కెరీర్ వేగం పుంజుకుంది. నిజానికి 'మిస్సమ్మ'లో మొదట భానుమతి కథానాయిక. కొన్ని రోజులు షూటింగ్ జరుపుకున్న తర్వాత అనివార్యమైన కారణాల వల్ల ఆ పాత్ర సావిత్రికి లభించింది. సావిత్రి తొలి రోజుల్లోనే కన్యాశుల్కంలోని 'మధురవాణి, తర్వాత 'మిస్సమ్మ' లో మేరీ, 'మాయాబజార్'లో శశిరేఖ పాత్రలలో ఆమె నటన మకుటాయమానమైంది. 'సంసారం సినిమాలో పనికిరావని ప్రకటించిన సినిమా రంగం.. దేవదాసు, మిస్సమ్మ లాంటి సినిమాలతో ఆమెకు పెద్ద పేట వేసింది. అద్భుతమయిన సావిత్రి ఎదుగుదల తనకు తానే సాటి అన్నంతగా ఒక ఒరవడిగా నిలిచిపోయింది. సావిత్రి నటించిన 'చివరకు మిగిలేది', 'వెలుగు నీడలు', 'మూగమనసులు', పూజా ఫలం', 'డాక్టర్ చక్రవర్తి', 'నాదీ ఆడజన్మ', 'నవరాత్రి', 'రక్తసంబంధం', 'మనసే మందిరం', మంచి మనసులు', 'సుమంగళి' ... ఇలా ఎన్నో సినిమాలు ఆమె నటనకు గీటురాళ్ళుగా మిగిలాయి. ఓ పక్క నటిగా ఎదుగుతూనే దర్శకత్వ బాధ్యతల వైపునకు మొగ్గు చూపింది. దర్శకురాలిగా చిన్నారి పాపలు, కుళందై ఉళ్ళం (తమిళం), మాతృదేవత, చిరంజీవి, వింత సంసారం, ప్రాప్తం (తమిళం) సినిమాలను రూపొందించింది. తర్వాత నిర్మాతగా 'వింత సంసారం', ప్రాప్తం (తమిళం) సినిమాలు తీశారు. నటనను జీవితంగా చేసుకున్న సావిత్రి జీవితంలో నటించలేక వెళ్లిపోయింది. అలా ఒక మహా నటి, వ్యక్తిత్వమున్న మహామనిషి సెలవంటూ వెళ్లిపోయారు.

# క్రమశిక్షణే మా మతం?



సాధారణంగానే మిలిటరీ రూల్స్ కఠినంగానే ఉంటాయి. అందులోని మాన్యువల్స్‌కు అధిక ప్రాధాన్యత ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే శిక్షలు కూడా నిర్దాక్షిణ్యంగా ఉంటాయి. దేశ భద్రతకు సంబంధించిన విషయం కాబట్టి క్రమశిక్షణ ఉల్లంఘనలకు ఎలాంటి మన్నింపులు, మాఫీలు ఉండవు. సైన్యంలో చేరేముందే వీటన్నింటిని గురించి ఆలోచించుకోవాలి. సాధారణ పౌరుడికి లభించే స్వేచ్ఛ కూడా కొన్ని సందర్భాల్లో సైనికులకు నిరాకరించవచ్చు. కోర్టులు కూడా సైనికుడి వాదనను త్రోసిపుచ్చుతాయి. కవాతులో భాగంగా పరమత దేవాలయంలోకి వెళ్లి పూజను ఆచరించకున్నా క్రమశిక్షణ తప్పిన కిందికే లెక్క. క్రైస్తవ మతానికి చెందిన సైనిక అధికారి సామ్యూల్ కమలేశన్ తన రెజిమెంట్ పాటించే హిందూ మత ఆచారాలను పాటించనందుకు క్రమశిక్షణ చర్యగా 2021 లో తన ఉద్యోగం కోల్పోయాడు. ఆర్మీ చట్టంలోని సెక్షన్ 19, ఆర్మీ రూల్స్‌లోని రూల్ 14 ప్రకారం తమ చర్య సక్రమమే అని సైన్యం అంటోంది. తనను తిరిగి ఉద్యోగం లోకి తీసుకోవాలని ఆయన ఢిల్లీ హైకోర్టులో, ఆ తర్వాత సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్లు కూడా ఫలితం ఇవ్వలేదు. రెండు కోర్టులు సైన్యం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించాయి. పంజాబ్ లోని మూడవ కల్వరి రెజిమెంట్ లో సామ్యూల్ కమలేశన్ లెఫ్టినెంట్ కల్నల్ గా 2017 లో చేరాడు. ఆ యూనిట్‌లో హిందూ గుడి, గురుద్వారా మాత్రమే ఉన్నాయి. వారంలో ఒకసారి సైనికులంతా కవాతుగా వెళ్లి ఆ దేవాలయాల్లో పూజలు నిర్వహిస్తుంటారు. వారితో గుడుల దాకా వెళ్లిన ఆయన హారతి సమయంలో బయటే ఉండిపోయేవాడు. ఈ ప్రవర్తన ఆర్మీ నిబంధనలకు విరుద్ధమని ఆయనకు పలుమార్లు చెప్పడం జరిగింది. ఆయన రెజిమెంటల్ పరేడ్‌లో పూర్తిగా పాల్గొన లేదని, ఆర్మీ చట్టంలోని సెక్షన్ 41 పై అధికారి ఆదేశాలను ఉల్లంఘించడం నేరమని కూడా పేర్కొంది. తన క్రైస్తవ విశ్వాసాలు ఇందుకు అనుమతించవని ఆయన అధికారులకు స్పష్టం చేశాడు. సుదీర్ఘ విచారణ తర్వాత అతను 2021 లో సర్వీస్ నుండి తొలగించబడ్డాడు. తన తొలగింపును సవాల్ చేస్తూ కమలేశన్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే మతపరమైన కవాతులో పాల్గొననందుకు ఆయనను సర్వీసు నుంచి తొలగించడాన్ని హైకోర్టు కూడా సమర్థించింది. మన సైన్యం అన్ని మతాలు, కులాలు, ప్రాంతాల ప్రజలతో రూపొందించబడింది, దీని ఏకైక లక్ష్యం దేశాన్ని రక్షించడం మాత్రమే. సైన్యం ఐక్యత వారి యూనిఫాం ద్వారా ఏర్పడుతుంది. కమలేశన్ ప్రవర్తన సైన్యం లౌకిక సూత్రాలకు విరుద్ధంగా ఉంది. తన రెజిమెంట్‌లో గుడి, గురుద్వారా ఉన్నాయని, అయితే అన్ని మతాలకు సంబంధించిన 'సర్వ ధర్మ స్థల్' లేదని, చర్చి కూడా లేదని కమలేశన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కొన్ని రెజిమెంట్ల పేర్లు లేదా సంప్రదాయాలు ఏదైనా మతం లేదా ప్రాంతంతో ముడిపడి ఉన్నప్పటికీ ఇది సైన్యం లౌకిక స్వభావాన్ని ప్రతిబింబిస్తుందని కోర్టు పేర్కొంది. అధికారి ప్రవర్తన రెజిమెంట్ ఐక్యత, క్రమశిక్షణ, లౌకిక విలువలకు హాని కలిగిస్తుందని హైకోర్టు అంగీకరించింది. యుద్ధ పరిస్థితుల్లో సైన్యంలో ఇటువంటి ప్రవర్తన హానికరమని, కమలేశన్ తన సీనియర్ అధికారుల ఆదేశాల కంటే తన మతానికి ప్రాధాన్యత ఇచ్చాడని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది.

చివరకు సుప్రీంకోర్టు కూడా కమలేశన్ తొలగింపుపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. సుప్రీం కోర్టులో పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలను ధర్మాసనం ఒప్పుకోలేదు. పూజ లేదా హారతి లాంటివి తన క్లయింట్ విశ్వాసానికి విరుద్ధం. రెజిమెంట్ వెంట తను వెళ్లేవాడు, కానీ లోపలికి వెళ్లి పూజలు చేయలేదు. అక్కడ 'సర్వ ధర్మ స్థల్' లేదు. దేవాలయాలు, గురుద్వారాలు మాత్రమే ఉన్నాయి. తనను ఏదైనా పూజ చేయిస్తారేమోనని భయపడ్డాడు అని న్యాయవాది వివరించగా కోర్టు ఆ మాటలని తోసిపుచ్చింది. సైనికుల మనోభావాలను మీ క్లయింట్ గౌరవించలేదు. ఆయనను ఎలాంటి పూజలు చేయమని ఎవరూ అడగలేదు. సైనికులతో కలిసి ఉండడం ఆయన విధి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రతి సెంటిమెంట్‌ను రక్షించదు. దేవాలయంలోకి అడుగు పెట్టడం క్రైస్తవ మతంలో ఎక్కడ నిషేధించబడింది అని ప్రశ్నించింది. ఇది భారత సైన్యం, ఇక్కడ సెక్యులరిజం అగ్రస్థానంలో ఉంటుంది. ఆయన తోటి సైనికుల మనోభావాలను గౌరవించలేదు. ఆయన వంద విషయాల్లో మంచివారు కావచ్చు, కానీ ఈ తప్పు చాలా పెద్దది. క్రమశిక్షణ విషయంలో ఎలాంటి మినహాయింపు ఇవ్వలేము. హైకోర్టు ఆదేశాలను కొనసాగిస్తాం అని సుప్రీం నిర్ణయించింది. వ్యక్తిగత మత విశ్వాసాలు పక్కన బెట్టి సైన్యం లౌకికతకి విలువనీయడం గొప్ప విషయమే. కానీ దాని వల్ల అన్ని మతాల వారికి సమాన అవకాశాలు లభించాలి. దేవాలయ సముదాయం ఒక్క ఆవరణలో ఉంటే సైనిక క్రమశిక్షణకు తప్పే అవసరం ఎవరికీ పడదు. ఇలా ఓ మైనారిటీ వర్గానికి చెందిన అధికారి మత విశ్వాస నమ్మిక వల్ల ఉద్యోగానికే ముప్పు వాటిల్లే పరిస్థితులు రావడం విచారకరమే. అయితే ఈ కేసు కొత్తగా ఒక రాజ్యాంగపరమైన ప్రశ్నను లేవనెత్తింది అనవచ్చు. ఆర్టికల్ 25 ప్రకారం ఒక మత విశ్వాసాన్ని ప్రకటించే, ఆచరించే హక్కు సైనిక క్రమశిక్షణకు లోబడి ఉండా అనే చర్చ అవసరం.

## చికిత్స నిర్ణయంపై బీమా సంస్థలకు

# అధికారం లేదు..!

**మన చౌరాస్తా, బిజినెస్ డెస్క్ :** వైద్య బీమా రంగంలో కీలక సంస్థగా ఉన్న స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు వినియోగదారుల కమిషన్ భారీ షాక్ ఇచ్చింది. బీమా సంస్థలు వైద్య చికిత్స పద్ధతులను నిర్దేశించలేవని సంచలన తీర్పునిచ్చింది. కోవిడ్‌కు సంబంధించిన క్లెయిమ్‌ను తిరస్కరించినందుకు స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్‌కు వడ్డీతో పాటు దాదాపు రూ. 50,000, వ్యాజ్య ఖర్చులను చెల్లించాలని ఘజియాబాద్ జిల్లా కన్స్యూమర్ ఫోరం ఆదేశించింది. బాధితురాలు ఇంట్లో ఐసోలేషన్‌లో ఉంటే సరిపోతుందని బీమా సంస్థ క్లెయిమ్‌ను తిరస్కరించింది. దీనిపై వినియోగదారుల ఫోరం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది సేవలో లోపమని కమిషన్ స్పష్టం చేసినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా ఓ కథనాన్ని వెల్లడించింది. వైద్య చికిత్స విధానాన్ని లేదా పద్ధతిని నిర్ణయించే అధికారం బీమా సంస్థకు లేదని తేల్చి చెప్పింది. కోవిడ్ సంబంధిత క్లెయిమ్‌ను తిరస్కరించిన స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదుపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. బీమా సంస్థ ఇప్పుడు దాదాపు రూ.50,000 మొత్తాన్ని సహా 6 శాతం వార్షిక వడ్డీతో పాటు రూ.2,000 వ్యాజ్య ఖర్చులను చెల్లించాలని స్టార్ హెల్త్‌ను కమిషన్ ఆదేశించింది. ఈ మొత్తాన్ని 30 రోజులలోపు చెల్లించాలని స్పష్టం చేసింది. రోగికి కరోనా లక్షణాలు లేని కారణంగా రోగికి ఇంట్లోనే చికిత్స అందించాల్సిందని.. కాబట్టి ఆసుపత్రిలో చేరడం అవసరం లేదని స్టార్ హెల్త్ క్లెయిమ్ తిరస్కరించింది. దాద్రీ నివాసి అయిన నీతూ నగర్ 2022 సెప్టెంబర్ 1న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (డిసిడిఆర్)కి ఫిర్యాదు చేశారు. నీతూనగర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె భర్త అజరు నగర్ 2018 నుండి స్టార్ హెల్త్ 'ఫ్యామిలీ హెల్త్ ఆప్టిమా ఇన్సూరెన్స్ పాలసీ' కింద కవరేజ్ కలిగి ఉన్నారు. ప్రతి సంవత్సరం ఎటువంటి అంతరాయం




లేకుండా చెల్లింపులు చేశారు. 2022 జనవరిలో పాలసీ నాలుగో సంవత్సరం నడుస్తున్నప్పుడు నీతూ నగర్‌కు తీవ్ర జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడంతో గ్రేటర్ నోయిడాలోని యథార్థ్ ఆసుపత్రిలో చేరారు. ఆయనకు హాస్పిటల్‌ల్లోనే సేవలు అవసరమని కుటుంబ సభ్యులు భావించారు. పాలసీ నిబంధనల ప్రకారం.. ఆసుపత్రిలో చేరడానికి ముందే బీమా సంస్థకు సమాచారం ఇచ్చారు. కొన్ని రోజుల్లో క్యాష్‌లెస్ క్లెయిమ్ ఆమోదించబడుతుందని కుటుంబానికి చెప్పారు. ఆసుపత్రి డిశ్చార్జ్ తర్వాత బిల్లులను చెల్లించడానికి స్టార్ హెల్త్ నిరాకరించింది. మొత్తం ఖర్చు రూ.49,423 కావడంతో కుటుంబం ఆ మొత్తాన్ని తమ సొంత డబ్బుతో చెల్లించి, రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసింది. దీంతో వారు కమిషన్‌ను ఆశ్రయించగా బీమా సంస్థ వాదనను కమిషన్ అధ్యక్షులు అనిల్ కుమార్ పుండిర్, సభ్యురాలు అంజు శర్మ తిరస్కరించారు. వైద్యుల నిర్ణయాన్ని బీమా సంస్థ ఎలా కొట్టిపారేస్తుందని స్పష్టం చేశారు. ''వైద్య నిపుణులు ఆసుపత్రిలో చేరడం అవసరమని సూచించినప్పుడు.. చికిత్సను ఇంట్లోనే చేయాలని బీమా సంస్థ పట్టుబట్టకూడదు. రోగి ఇంట్లో ఐసోలేషన్‌లో చికిత్స పొందాల్సిందనే కారణంతో క్లెయిమ్‌ను తిరస్కరించడం సేవల్లో లోపమే.'' అని తేల్చారు. ఆసుపత్రి ఖర్చులతో పాటు వడ్డీ, కేసు ఖర్చులను రీయింబర్స్ చేయాలని స్టార్ హెల్త్‌ను ఆదేశించారు.




## ఈ పత్రాలు ఉంటే..

### శాలరీ స్లిప్ లేకుండానే పర్సనల్ లోన్

**మన చౌరాస్తా, బిజినెస్ డెస్క్ :** వ్యక్తిగత రుణం తీసుకోవాలంటే బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలు మొట్ట మొదటిగా అడిగేది మీరు ఏ ఉద్యోగం చేస్తున్నారు, మీ శాలరీ స్లిప్ ఉందా? అని. వచ్చే వేతనం ఆధారంగానే ఏ గ్యారంటీ లేకుండా లోన్ ఇస్తారు. అయితే వ్యాపారం చేసే వారు, అద్దె ఆదాయం ఉన్నవారు, స్వయం ఉపాధి పొందుతున్న వారికి ఎలాంటి శాలరీ స్లిప్ ఉండదు. అయినా వాళ్లు కూడా పర్సనల్ లోన్ తీసుకోవచ్చు. మరి అది ఎలా అనే ప్రశ్న మీకు వచ్చే ఉంటుంది. కొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లు సమర్పించి లోన్ ఈజీగా పొందవచ్చు. స్థిరమైన ఆదాయం ఉందని బ్యాంకులకు నమ్మకం కలిగించాలి. మంచి క్రెడిట్ స్కోరు ఉండాలి. గత 6 నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్స్, రెగ్యులర్ క్రెడిట్స్ సహా బ్యాంక్ ఖాతాలో బ్యాలెన్స్ చూపించాలి. మీకు ప్రతి నెలా డబ్బు క్రమంగా పెద్ద మొత్తంలో వస్తుందని తెలియజేయాలి. గత రెండేళ్లకు సంబంధించిన ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్ చూపించాలి. ఐటీఆర్ ఫైల్ చేసేవారికి లోన్ త్వరగా అందుతుంది. ఒకవేళ ఫార్మ్ 16 ఉంటే ఇవ్వాలి. బిజినెస్ చేసే వారు జీఎస్‌టి రిటర్న్స్ చూపించాల్సి ఉంటుంది. రెంట్ ఇన్ కమ్, ఇన్వెస్ట్‌మెంట్ ఇన్‌కమ్ పత్రాలు చూపించాలి. ఈ డాక్యుమెంట్లు ఇస్తే బ్యాంక్ స్థిరమైన ఆదాయం ఉందని నమ్ముతుంది. అయితే, డాక్యుమెంట్లతో పాటు క్రెడిట్ ప్రొఫైల్ బలంగా ఉందని చూపించాలి. క్రెడిట్ స్కోర్ 750కి పైగా ఎక్కువగా ఉన్నట్లయితే లోన్ ఈజీగా వస్తుంది. అలాగే డెట్ టు ఇన్‌కమ్ రేషియో తక్కువగా ఉండాలి. డిజిటల్ లోన్స్ ఇచ్చే కంపెనీలు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, ప్రైవేట్ బ్యాంకులు ఈ రుణాలు ఇస్తుంటాయి. బ్యాంక్ స్టేట్‌మెంట్, క్రెడిట్ స్కోర్, క్యాష్ ఫ్లో చూసి రుణాలు ఇస్తాయి. లోన్ తీసుకునేముందు వడ్డీ రేటు, ఇఎంఐ టెన్యూర్ చెక్ చేసుకోవడం చాలా ముఖ్యం. అయితే పర్సనల్ లోన్‌లో 5 రిస్కులు ఉంటాయి. ఇందులో వడ్డీ ఎక్కువగా ఉంటుంది. నెలవారీ ఇఎంఐ మిస్ అయినట్లయితే క్రెడిట్ స్కోర్ భారీగా పడిపోతుంది. ముందుగానే లోన్ క్లోజ్ చేయాలంటే పెనాల్టీ పడుతుంది. దీన్ని ప్రీక్లోజర్ ఛార్జెస్ అని పిలుస్తారు. ఇఎంఐ లు మిస్ అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

## ఆ గ్లూకోజ్ మానిటర్ల వాడకం ఆపండి

**మన చౌరాస్తా, బిజినెస్ డెస్క్ :** అబాట్ డయాబెటిస్ కేర్ తయారుచేసిన గ్లూకోజ్ మానిటర్ సెన్సార్‌ల వల్ల ఏడుగురు మరణించడం, సుమారు ఏడు వందల మంది తీవ్ర అనారోగ్య ముప్పు బారిన పడటంతో.. కొన్ని రకాల గ్లూకోజ్ మానిటర్‌ల వాడకాన్ని ఆపేయాలని అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) హెచ్చరించింది. కొన్ని ఫ్రీస్టయిల్ లిబ్రే 3, ఫ్రీస్టయిల్ లిబ్రే 3 ప్లస్ సెన్సార్లు తప్పుడు గ్లూకోజ్ రీడింగ్‌లను చూపించొచ్చని ఎఫ్‌డీఏ అధికారులు తెలిపారు. 'తప్పు రీడింగ్ వల్ల మధుమేహ రోగులు.. వ్యాధి చికిత్స కోసం అవలంబించే జాగ్రత్తలను తగ్గించే అవకాశం ఉంటుంది. కార్బోహైడ్రేట్లను ఎక్కువగా తినడం, ఔషధాలు, ఇన్సులిన్ తీసుకోవడాన్ని తగ్గించడం లేదా మానేయడం లాంటివి చేయొచ్చు. ఇలా ఆరోగ్యం విషయంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడొచ్చు. కొన్ని సందర్భాల్లో రోగి మరణానికి దారితీయొచ్చ'ని ఎఫ్‌డీఏ హెచ్చరించింది. అమెరికాలోని ఒక ఉత్పత్తి కేంద్రంలో తయారైన సుమారు 30 లక్షల సెన్సార్‌లపై ఎఫ్‌డీఏ హెచ్చరికల ప్రభావం పడనుందని అబాట్ అధికారులు తెలిపారు.





## ఈ బ్యాంకులో 'హోమ్ లోన్'

# తీసుకున్నవారికి శుభవార్త

**మన చౌరాస్తా, బిజినెస్ డెస్క్ :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటన వచ్చిన కొన్ని గంటల్లోనే దేశంలోని దిగ్గజ ప్రభుత్వ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా తమ కస్టమర్లకు అదిరే శుభవార్త అందించింది. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించిన క్రమంలో బెంచ్‌మార్క్ రిటైల్ లోన్ లెండింగ్ రేట్ సవరిస్తున్నట్లు తెలిపింది. వివిధ రుణాలకు లింకై ఉన్న ఈ బీఆర్ఎల్‌ఎల్‌ఆర్ రేటును తగ్గిస్తున్నట్లు తెలిపింది. సవరించిన కొత్త వడ్డీ రేట్లను డిసెంబర్ 6, 2025 నుంచే అమలులోకి తెస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు పత్రికా ప్రకటన చేసింది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ వెబ్‌సైట్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా నోటిఫికేషన్ ప్రకారం.. సవరించిన బీఆర్‌ఎల్‌ఎల్‌ఆర్ రేటు డిసెంబర్ 6 నుంచే అమలులోకి వస్తుంది. ప్రస్తుతం 8.15 వద్ద ఉన్న ఈ వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించి 7.90 శాతానికి తగ్గించినట్లు పేర్కొంది. దీంతో రుణాల వడ్డీ రేటు తగ్గి నెలవారీ ఈఎంఐల భారం తగ్గనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం రోజున రెపో రేటును మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో రెపో రేటు 5.50 శాతం నుంచి 5.25 శాతానికి తగ్గింది. ఈ ఏడాది 2026లో మొత్తంగా చూసుకుంటే 125 బేసిస్ పాయింట్ల మేర కోత పెట్టింది. గత 2025 ఫిబ్రవరిలో 25 బేసిస్ పాయింట్లు, జూన్ నెలలో 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అయితే, అక్టోబర్ నెలలో జరిగిన ఎంపీసీ మీటింగ్‌లో వడ్డీ రేట్లను మార్చకుండా యథాతథంగా కొనసాగించింది. చాలా మంది తమ గృహ రుణాలను మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు, బేస్ రేటు లేదా బెంచ్ మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు వంటి వాటి ఆధారంగా తీసుకుంటున్నారు. ఈబీఎల్‌ఆర్ కంటే ఎక్కువ వడ్డీ రేటు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం బ్యాంక్ ఈబీఎల్‌ఆర్ రేటును తగ్గించిన క్రమంలో వారందరికీ ఊరట లభించనుంది. చాలా వరకు హోమ్ లోన్స్ ఈబీఎల్‌ఆర్ కు లింక్ అయి ఉంటాయి. తాజా రెపో రేటు తగ్గింపు కారణంగా హోమ్ లోన్ వడ్డీ రేట్లు తగ్గి ఈఎంఐల భారం తగ్గనుంది. బ్యాంకులు హోమ్ లోన్ వడ్డీ రేటు తగ్గించినప్పుడు రుణగ్రహీతలకు రెండు ఆప్షన్స్ ఇస్తారు. తమ ఈఎంఐని తగ్గించుకోవడం లేదా హోన్ లోన్ టెన్యూర్ తగ్గించుకోవడం చేయొచ్చు. అయితే, హోమ్ లోన్ టెన్యూర్ తగ్గించుకోవడం ద్వారానే దీర్ఘకాలంలో భారీగా ఆదా చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.







## ఆర్‌బిఐ వడ్డీ రేట్లు

# పావు శాతం తగ్గింపు

**మన చౌరాస్తా, బిజినెస్ డెస్క్ :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మరోమారు వడ్డీ రేట్లకు కోత పెట్టింది. రెపోరేటును పావు శాతం తగ్గించి 5.25 శాతానికి పరిమితం చేసింది. ఆర్‌బిఐ గవర్నర్ సంజరు మల్హోత్రా అధ్యక్షతన మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) నిర్ణయాలను ఆయన శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ కాలంలో మూడు సార్లు వడ్డీ రేట్లను 100 బేసిస్ పాయింట్లు తగ్గించామని గుర్తు చేశారు. నాలుగోసారి కూడా 25 బేసిస్ పాయింట్లు తగ్గించామని చెప్పారు. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటివరకు రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. ఈ క్రమంలో గృహ, వాహన, రిటైల్, వ్యక్తిగత రుణాలపై భారం తగ్గుతోంది. రూపాయి పతనం కొనసాగుతున్నప్పటికీ.. ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయికి పడిపోవడంతో వృద్ధి రేటు పెరగడంతో రేట్ల కోత చేపట్టామని మల్హోత్రా అన్నారు. బాహ్య వాతావరణం ప్రతికూల సవాళ్లతో కూడుకున్నప్పటికీ భారతీయ ఆర్థిక వ్యవస్థ మెరుగైన ప్రగతిని ప్రదర్శించిందన్నారు. తగ్గిన ద్రవ్యోల్బణం మరింత వృద్ధికి మద్దతుగా నిలవడానికి వీలు కల్పించనుందని పేర్కొన్నారు.జిఎస్‌టి శ్లాబుల తగ్గింపునతో కొనుగోళ్లు పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో 8.2శాతం వృద్ధి నమోదయ్యింది. దీంతో 202526 ఆర్థిక సంవత్సరానికి గానూ జిడిపి అంచనాలను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నాం. ధరలు కూడా తగ్గుముఖం పట్టినందున 202526కు గాను ద్రవ్యోల్బణం అంచనాలను 2.6 శాతం నుంచి 2 శాతానికి అంచనా వేస్తున్నాము. విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఇవి సరిపోతాయి. అని మల్హోత్రా తెలిపారు. ఆర్‌బిఐ వడ్డీ రేట్ల కోత వార్తలతో స్టాక్ మార్కెట్లు సానుకూలంగా ట్రేడింగ్ అయ్యాయి. వారాంతం సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ 447 పాయింట్ల లాభంతో 85,712కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 153 పాయింట్లు పెరిగి 26,186 వద్ద ముగిసింది.

# నెట్‌ఫ్లిక్స్, వార్నర్ బ్రదర్స్ భారీ డీల్..

**మన చౌరాస్తా, బిజినెస్ డెస్క్ :** ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో సంచలనం చోటుచేసుకుంది. ప్రపంచ వినోద రంగంలో భారీ డీల్ కుదిరింది. స్ట్రీమింగ్ జెయింట్ నెట్‌ఫ్లిక్స్ , హాలీవుడ్‌లో అత్యంత పురాతన, దిగ్గజ స్టూడియోల్లో ఒకటైన వార్నర్ బ్రదర్స్ డిస్కవరీకు చెందిన సినిమా, టీవీ స్టూడియోలు, స్ట్రీమింగ్ యూనిట్‌ను కొనుగోలు చేసేందుకు అంగీకరించింది. ఈ డీల్ విలువ సుమారు 72 బిలియన్ డాలర్లు. ఈ హక్కుల కోసం కామ్‌కాస్ట్, పారామౌంట్ స్కైడాన్స్ వంటి దిగ్గజ సంస్థలు కూడా పోటీ పడ్డాయి. అయితే వాటిని మించిపోయి నెట్‌ఫ్లిక్స్ ఈ భారీ కొనుగోలును ఫైనలైజ్ చేయడం విశేషం. ఇప్పటికే హ్యారీ పోటర్, గేమ్ ఆఫ్ థ్రోన్స్ సహా అనేక హెచ్‌బిఒ మ్యాక్స్ ఫ్రాంచైజీల స్ట్రీమింగ్ హక్కులు నెట్‌ఫ్లిక్స్ వద్ద ఉన్న విషయం తెలిసిందే. ఈ డీల్ విజయవంతం కావడంలో అమెరికా ఫెడరల్ నియంత్రణ సంస్థల ఆమోదం కీలకం కానుంది. ఈ అంశంపై బోకే క్యాపిటల్ పార్ట్నర్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ కిమ్ ఫారెస్ట్ మాట్లాడుతూ.. స్ట్రీమింగ్ రంగంలో ప్రధాన సంస్థ అయిన నెట్‌ఫ్లిక్స్ ఈ పోటీలో నెగ్గడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. ఇక, ఈ భారీ కొనుగోలుతో నెట్‌ఫ్లిక్స్ షేర్ ధరను వెంటనే పెంచుతుందేమో అనేది చర్చనీయాంశంగా మారింది. 2022 నుంచి ఐదింతలు పెరిగిన నెట్‌ఫ్లిక్స్ స్టాక్ మళ్లీ ఎగబాకేందుకు ఇన్వెస్టర్లు మరింత బలమైన ట్రిగ్గర్ కోసం ఎదురు చూస్తున్నారని చర్చ జరుగుతోంది. ఈ డీల్ పూర్తి అయితే, వినోద రంగంలో శక్తి సమీకరణాలు మారే అవకాశమున్నాయని ఇండస్ట్రీ నిపుణులు అంచనా వేస్తున్నారు.



# కిడ్నీ ప్రాబ్లమ్స్

## ఉంటే కనిపించే లక్షణాలు

కిడ్నీల సమస్యలు అనేవి మనకి అనేక రూపంలో కనిపిస్తాయి. మూత్రంలో, మూత్ర రంగులో, మూత్ర విసర్జన శరీరంలోని ఇతర భాగాల్లోనూ కిడ్నీలు దెబ్బతిన్న లక్షణాలు కనిపిస్తాయి. వీటిని మనం కొన్నిసార్లు నిర్లక్ష్యం చేస్తుంటాం. కానీ, వీటిని పూర్తిగా పట్టించుకోకపోతే అవి తీవ్రంగా మారి కిడ్నీలు ఫెయిల్ అయ్యే ప్రమాదాన్ని కలిగిస్తుంది. మీకు గనుక హైబీపి, షుగర్ వంటి సమస్యలు ఉంటే కిడ్నీ ప్రాబ్లమ్స్ మరింత సీరియస్‌గా మారతాయి. కిడ్నీల సమస్యలు సాధారణంగా మొదటగా కనిపించవు. కొన్నిసార్లు లాస్ట్ స్టేజ్ వరకూ కూడా కనిపించవు. కొన్ని లక్షణాలు కనిపించినప్పటికీ వాటిని మనం మామూలూ సమస్యలే అని వదిలేస్తాం. అలాంటప్పుడు అవి తీవ్రంగా మారతాయి. కిడ్నీల పనితీరు తగ్గడం వల్ల రక్తంలో ట్యాక్సిన్స్, మలినాలు పేరుకుపోతాయి. దీంతో ఊరికే అలసిపోవడం, బలహీనంగా మారిపోతుంటాం. ఏ పనిపై కూడా దృష్టి కేంద్రీకరించం. రక్తం తక్కువగా ఉంటుంది. దీంతో ఊరికే అలసిపోతారు. ఇది చాలా సాధారణ లక్షణం. మూత్రపిండాల పనితీరు తగ్గి ట్యాక్సిన్స్ పేరుకుపోవడం వల్ల ఇలా జరుగుతుంది. కిడ్నీలు సరిగ్గా ఫిల్టర్ చేయనప్పుడు ట్యాక్సిన్స్ అన్నీ బాడీలోనే ఉంటాయి. రక్తంలోనే అలా ఉండిపోయి నిద్రపోవడం కూడా కష్టంగా మారుతుంది. అతేకాకుండా, డయాబెటిస్, కిడ్నీసమస్యల మధ్య కూడా సంంధం ఉంటుంది. కిడ్నీ సమస్యలు ఉన్నవారికి నిద్ర సరిగ్గా పట్టకపోవడం, స్లీప్ ఆప్నియా వంటి సమస్యలు కూడా ఉంటాయి. హెల్దీ మూత్రపిండాలు ఎన్నో పనులని చేస్తాయి. అవి బాడీ నుండి వ్యర్థాలను, అదనపు ద్రవాన్ని తొలగిస్తాయి. ఎర్రరక్తకణాలని తయారుచేయడంలో సాయపడతాయి. ఎముకల్ని బలంగా ఉంచుతాయి. మీ రక్తంలో సరైన మొత్తంలో ఖనిజాలని నిర్వహించడానికి పనిచేస్తాయి. దీంతో స్కిన్ డ్రైగా మారి దురద పెడుతుంది. కిడ్నీ సమస్యతో పాటు ఖనిజ, ఎముకల సమస్యలు కూడా వస్తాయి. రక్తంలో ఖనిజాలు, పోషకాల బ్యాలెన్స్ లేనప్పుడు ఇలాంటి సమస్యలు వస్తాయి. కిడ్నీ సమస్యలు ఉన్నప్పుడు మూత్ర సమస్యలు వస్తాయి. ఎక్కువగా మూత్ర విసర్జన చేయడం, మూత్రపిండాల ఫిల్టర్స్ దెబ్బతింటే ఇలా జరుగుతుంది. కొన్నిసార్లు యూరిన్ ఇన్ఫెక్సన్, ఎన్‌లార్జ్‌డ్ ప్రోస్టేట్ కారణంగా కూడా జరగొచ్చు. అదే విధంగా. మూత్రంలో రక్తం కనబడుతుంది. కిడ్నీలు ఫెయిల్ అయినప్పుడు రక్తకణాలు మూత్రంలోకి లీక్ అవుతాయి. దీంతో మూత్రంలో రక్తం కణితులు, మూత్రపిండాల్లో రాళ్ళు, ఇన్ఫెక్షన్స్ సూచిస్తుంది. అంతేకాకుండా మూత్రంలో ఎక్కువ నురగ వస్తుంది. మూత్రంలో ప్రోటీన్ రావడం వల్ల ఇలా జరుగుతుంది. మూత్రంలో ప్రోటీన్ పెరిగితే మూత్రపిండాల ఫిల్టర్స్ దెబ్బతిన్నాయని అర్థం. దీని వల్ల ప్రోటీన్ మూత్రంలోకి లీక్ అయి శరీరంలో ప్రోటీన్‌ని నిలుపుకోకుండా పెద్దం మొత్తంలో ప్రోటీన్‌ని లీక్ చేయడం వల్ల కళ్ళ చుట్టూ వాపు ఉంటుంది. మూత్రపిండాల పనితీరు తగ్గితే సోడియం నిల్చిపోతుంది. దీంతో మీ పాదాలు, చీలమండలలో వాపు వస్తుంది. కొన్నిసార్లు గుండెజబ్బులు, లివర్ ప్రాబ్లమ్స్ కాళ్ళ సిర సమస్యలు ఉన్నా ఇవే లక్షణాలు ఉంటాయి. దీంతోపాలు కిడ్నీ పనితీరు తగ్గడం వల్ల ఎలక్ట్రోలైట్స్ ఇన్‌బ్యాలెన్స్ అవుతాయి. దీంతో కండరాల నొప్పులు ఉంటాయి.

# పాత ప్లాస్టిక్ బాటిళ్ళతో నీళ్లు తాగుతున్నారా?

**ప్లాస్టిక్ బాటిళ్ల** నుండి నీరు త్రాగే అలవాటు చాలా సరళంగా అనిపించవచ్చు. కానీ దాని వెనుక దాగి ఉన్న ప్రభావం చాలా ముఖ్యమైనది. రోజువారీ జీవితంలోని హడావిడిలో, మనం తరచుగా ప్రయాణంలో ప్లాస్టిక్ ప్యాక్ చేసిన నీటి సీసాలను కొంటాము. పాత ప్లాస్టిక్ సీసాలను కడిగి మళ్ళీ మళ్ళీ వాడతాము. ఇలా చేస్తే, ఆపాల్సిన సమయం ఆసన్నమైంది. ప్లాస్టిక్ బాటిళ్ల నుండి నీరు త్రాగే అలవాటు చాలా సరళంగా అనిపించవచ్చు. కానీ దాని వెనుక దాగి ఉన్న ప్రభావం చాలా ముఖ్యమైనది. రోజువారీ జీవితంలోని హడావిడిలో, మనం తరచుగా ప్రయాణంలో ప్లాస్టిక్ ప్యాక్ చేసిన నీటి సీసాలను కొంటాము. పాత ప్లాస్టిక్ సీసాలను కడిగి మళ్ళీ మళ్ళీ వాడతాము. మీరు కూడా ఇలా చేస్తే, ఆపాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ సీసాలు హాని చేయనివిగా అనిపించవచ్చు, కానీ వాటిలో దాగి ఉన్న ప్రమాదం మన ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని దెబ్బతీస్తోంది. ఏకంగా ప్రాణాలకే ముప్పు అంటున్నారు నిపుణులు. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ సీసాలు మన తాగునీటిలోకి మైక్రోప్లాస్టిక్‌లను విడుదల చేస్తాయి. మైక్రోప్లాస్టిక్‌లు చాలా చిన్న ప్లాస్టిక్ కణాలు, ఇవి 5 మిమీ కంటే తక్కువ వ్యాసం కలిగి ఉంటాయి.



అవి మన నీటి వనరులలోకి వివిధ మార్గాల ద్వారా ప్రవేశిస్తాయి: పాత ప్లాస్టిక్ విచ్ఛిన్నం కావడం, దుస్తుల నుండి మైక్రోఫైబర్‌లు తొలగిపోవడం, సీసాలు అరిగిపోవడం. నేడు, మహాసముద్రాలు మాత్రమే కాదు, నదులు, సరస్సులు, గాలి కూడా మైక్రోప్లాస్టిక్‌లతో నిండిపోయాయి. ఇవి మన శరీరానికి అత్యంత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం ప్లాస్టిక్ బాటిళ్ల నుండి నీరు త్రాగినప్పుడు, అనుకోకుండా ఈ చిన్న కణాలను మనం మింగేస్తాము. అనేక అంతర్జాతీయ అధ్యయనాలు బాటిల్ వాటర్‌లో మైక్రోప్లాస్టిక్‌లను కనుగొన్నాయి. వాటి ఆరోగ్య ప్రభావాల గురించి తీవ్రమైన ఆందోళనలు వ్యక్తమవుత్తుతున్నాయి. ప్లాస్టిక్‌లలోని కొన్ని రసాయనాలు శరీరంలోకి ప్రవేశించి హార్మోన్ల అసమతుల్యత, ఊబకాయం, ఇన్సులిన్ నిరోధకత, సంతానోత్పత్తి ప్రభావాలు, కొన్ని సందర్భాల్లో క్యాన్సర్ వంటి హానిని కలిగిస్తాయి. ఈ కణాల దీర్ఘకాలిక ప్రభావాలపై పరిశోధనలు కొనసాగుతున్నప్పటికీ, మైక్రోప్లాస్టిక్‌లు వాపు, ఆక్సీకరణ ఒత్తిడి, శరీరంలోకి హానికరమైన రసాయనాల బదిలీకి కారణమవుతాయని ప్రస్తుత ఆధారాలు సూచిస్తున్నాయి. ఈ సమస్యపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ ఒక నివేదికను విడుదల చేసింది. దీన్ని నివారించడానికి మీరు ఏమి చేయగలరో తెలుసుకుందాం. ముందుగా, ప్లాస్టిక్ బాటిళ్లను వదిలేసి, స్టీల్, గాజు లేదా బిపిఎ లేని బాటిళ్లను ఉపయోగించండి. రెండవది, నీటిలో కాలుష్య కారకాలను, ముఖ్యంగా మైక్రోప్లాస్టిక్‌లను తగ్గించగల నీటి వడపోత వ్యవస్థను ఉపయోగించండి. ప్రతి ఫిల్టర్ పరిపూర్ణంగా ఉండదు, కానీ మెరుగైన సాంకేతికత కలిగిన ఫిల్టర్లు మైక్రోప్లాస్టిక్‌ల పరిమాణాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. ప్లాస్టిక్ బాటిళ్ల వల్ల కలిగే పర్యావరణ నష్టం కూడా తక్కువ ప్రమాదకరమైనదేం కాదు. ఉపయోగం తర్వాత విస్మరించిన ప్రతి బాటిల్ సముద్ర జీవులకు, నదులకు, మొత్తం పర్యావరణ వ్యవస్థకు హాని కలిగిస్తుంది. ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది.

## బీట్‌రూట్ ఆకులు తింటే లాభామా?



బీట్‌రూట్ ఆకుల్లో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి, జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి, మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. ఎముకలను బలోపేతం చేస్తాయి, కంటి చూపును రక్షిస్తాయి. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల బరువు తగ్గడంలో సహాయపడతాయి. బీట్‌రూట్ ఆకులను మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. బీట్‌రూట్ మాదిరిగానే బీట్‌రూట్ ఆకుల్లో కూడా పోషకాలు పుష్కలంగా ఉంటాయి. బీట్‌రూట్ ఆకులు తింటే ఫెర్టిలిటీ రేటు పెరుగుతుంది. ఇందులోని ఫోలేట్ శిశువు ఎదుగుదలకు సహాయపడుతుంది. బీట్‌రూట్ ఆకుల్లో నైట్రేట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సిజన్ లెవెల్స్‌ను పెంచుతాయి. రక్తపోటును కంట్రోల్ చేస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. బీట్‌రూట్ ఆకుల్లో విటమిన్ ఎ కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. ఇది కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బీట్ రూట్ ఆకుల్లో విటమిన్ ఎ, సి, బి 6తో పాటు ఐరన్ సమృద్ధిగా లభిస్తాయి. బీట్‌రూట్ ఆకులు తింటే ఇన్ఫెక్షన్ల నుంచి దూరంగా ఉండొచ్చు. ఎందుకంటే బీట్‌రూట్ ఆకుల్లో విటమిన్ సి కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధకశక్తిని పెంచుతుంది. బీట్‌రూట్ ఆకుల్లో కరిగే ఫైబర్, కరగని ఫైబర్ ఉంటుంది. ఇవి పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. బీట్‌రూట్ ఆకులు తింటే గట్ బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. జీర్ణ సమస్యలు రావు. బీట్‌రూట్ ఆకులు తింటే వయస్సుతో పాటు వచ్చే కంటి సమస్యలు తగ్గుతాయి. అంతేకాదు.. బీట్‌రూట్ ఆకుల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది కడుపు నిండిన ఫీల్ అందిస్తుంది. ఫలితంగా తక్కువ తింటారు. దీంతో బరువు తగ్గొచ్చు. బీట్‌రూట్ ఆకుల్లో మెగ్నీషియం, కాల్షియం, విటమిన్ డి అధిక మోతాదులో లభిస్తుంది. ఇవి ఎముకలను బలంగా, ఆరోగ్యవంతంగా మార్చుతాయి. బీట్‌రూట్ ఆకుల్లో ఉండే విటమిన్ బి 6 మెదడు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. బీట్‌రూట్ ఆకులు తింటే మెదడు పనితీరు మెరుగుపడుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

# చికెన్ తింటున్నారా..

## అయితే ఈ జాగ్రత్తలు పాటించండి !



ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు మన పెద్దలు. కానీ ఆరోగ్యం పట్ల ఎవరు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఈ మధ్యకాలంలో బయట ఫుడ్ విపరీతంగా తిని అనారోగ్యం పాలవుతున్నారు. ఇక మరికొంతమంది ముక్క లేనిదే ముద్ద దిగదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇలాంటి నేపథ్యంలో తరచూ చికెన్ తినేవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు వైద్యులు. మటన్ ధరలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో ఎక్కువ శాతం జనాలు చికెన్ కొనుగోలు చేస్తారన్న సంగతి తెలిసిందే. అయితే ఈ చికెన్ వండుకునేటప్పుడు కొన్ని టిప్స్ పాటిస్తే, ఎలాంటి రోగాలు రావని చెబుతున్నారు వైద్యులు. చికెన్ షాప్ నుంచి తీసుకువచ్చిన మాంసాన్ని వండేటప్పుడు, కచ్చితంగా ఒకసారి ఉప్పుతో కడగాలని సూచిస్తున్నారు. దానివల్ల చికెన్ పైన ఉన్న క్రిములు, ముఖ్యంగా బ్యాక్టీరియా చనిపోతుందట. అప్పుడు చికెన్ ఫ్రెష్ గా ఉంటుందని చెబుతున్నారు. అలా తినడం వల్ల స్కిన్ ఎలర్జీ, జుట్టు రాలడం, చుండ్రు సమస్యకు చెక్ పెట్టవచ్చట. అలాగే స్కిన్ తో కాకుండా స్కిన్ లెస్ చికెన్ మాత్రమే తినాలని చెబుతున్నారు వైద్యులు. ఇక చికెన్ కనీసం 74 డిగ్రీల వరకు పూర్తిగా ఉడికేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. ఎక్కువ వేడికి బ్యాక్టీరియా చనిపోతుందని స్పష్టం చేస్తున్నారు. అయితే చికెన్ కడగకపోతే, ఎక్కువసేపు ఉడికిస్తే సరిపోతుందని కూడా వైద్యులు సూచనలు చేస్తున్నారు. మటన్ కంటే చికెన్ తొందరగా జీర్ణం అవుతుంది. కాబట్టి చికెన్ ఎలాంటి వయసు ఉన్న వారైనా చికెన్ తినవచ్చని స్పష్టం చేస్తున్నారు.

# గర్భస్రావి శిశువు ఆరోగ్యానికి అద్దం పట్టే ముఖ్య పరీక్ష



గర్భధారణ కాలంలో తల్లి మరియు బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడటానికి ఆధునిక వైద్య సాంకేతికతలు అనేక మార్గాలను అందిస్తున్నాయి. వాటిలో ఒకటి ముఖ్యమైనది టిఫా స్కాన్, దీని పూర్తి రూపం టార్గెటెడ్ ఇమేజింగ్ ఫర్ ఫ్యూటల్ అనోమలీస్. ఈ పరీక్ష అల్ట్రాసౌండ్ ఆధారితమైనది, గర్భంలోని శిశువులో ఏవైనా అసాధారణతలను ముందుగానే గుర్తించడానికి రూపొందించబడింది. సాధారణ అల్ట్రాసౌండ్‌లతో పోల్చితే, టిఫా మరింత వివరణాత్మకంగా పనిచేస్తుంది మరియు డాక్టర్లకు సమగ్ర చిత్రాన్ని అందిస్తుంది. ఇది గర్భధారణ రెండవ ట్రైమెస్టర్‌లో, సాధారణంగా 18వ వారం నుంచి 22వ వారం మధ్య చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ స్కాన్ ద్వారా గుర్తించబడే సమస్యలు త్వరగా చికిత్సించబడితే, తల్లీబిడ్డల భవిష్యత్తును మెరుగుపరచవచ్చు. టిఫా స్కాన్‌ను మాత్రమే నిపుణులైన రేడియాలజిస్టులు లేదా ఫ్యూటల్ మెడిసిన్ నిపుణులు చేయాలని వైద్యులు హైలైట్ చేస్తున్నారు. ఈ పరీక్షలో అధునాతన అల్ట్రాసౌండ్ మెషీన్‌లను ఉపయోగించి, శిశువు శరీరంలోని ప్రతి భాగాన్ని డీటెయిల్‌గా పరిశీలిస్తారు. ప్రక్రియ సాధారణంగా 30 నుంచి 45 నిమిషాలు పడుతుంది మరియు ఇది నొప్పిలేే, సురక్షితమైనది. తల్లికి ఎలాంటి రిస్క్ లేదు, ఎందుకంటే ఇది రేడియేషన్ లేని పద్ధతి. ఈ స్కాన్ చేసే సమయంలో తల్లి గర్భం గురించి వివరాలు, మునుపటి మెడికల్ హిస్టరీని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా చేయడం వల్ల పరీక్ష ఫలితాలు మరింత ఖచ్చితమవుతాయి మరియు అవసరమైతే అదనపు టెస్టులు సూచించబడతాయి. ఈ స్కాన్ ద్వారా శిశువు తల నుంచి కాళ్ల వరకు అన్ని అవయవాలను మెదడు, గుండె, కాలేయం, కిడ్నీలు, ఎముకలు మరియు ఇతర అంగాలను పూర్తిగా స్కాన్ చేస్తారు. అలాగే, ప్లాసెంటా స్థానం, అమ్నియాటిక్ ద్రవం (ఉమ్మనీరు) మొత్తం మరియు గుణాలు, శిశువు పొదవలు మరియు గర్భాశయం స్థితిని కూడా పరిశీలిస్తారు. ఏవైనా అసాధారణతలు ఉంటే, అవి ముందుగానే గుర్తించి చికిత్సా ప్రణాళికను రూపొందించవచ్చు. ఉదాహరణకు, శిశువులో గుండె సమస్యలు లేదా ఎముకల అభివృద్ధి లోపాలు ఉంటే, డాక్టర్లు సరైన సలహాలు ఇస్తారు. ఈ వివరణాత్మక చిత్రణ తల్లికి మానసిక శాంతిని కల్పిస్తుంది మరియు భవిష్యత్ ప్రణాళికలకు సహాయపడుతుంది. టిఫా స్కాన్ ఫలితాలు తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని బట్టి ప్రసవ పద్ధతిని నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఉదాహరణకు, ప్లాసెంటా స్థానం అసాధారణంగా ఉంటే సిజేరియన్ అవసరమవుతుందో లేదో తెలుస్తుంది. అలాగే, శిశువు పొదవలు బలహీనంగా ఉంటే, సహజ ప్రసవం సాధ్యమేనా అని నిర్ణయించవచ్చు. నిపుణులు ఈ స్కాన్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని సిఫార్సు చేస్తున్నారు, ఎందుకంటే ఇది సంభావ్య సమస్యలను ముందుగానే ఎదుర్కోవడానికి అవకాశాన్ని ఇస్తుంది. ఇలాంటి పరీక్షలు గర్భధారణను మరింత సురక్షితంగా మారుస్తాయి మరియు తల్లులకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. చివరగా, ఆధునిక వైద్య సదుపాయాల్లో ఈ స్కాన్ సులభంగా అందుబాటులో ఉంది, కాబట్టి దీన్ని మిస్ చేయకూడదు.

# అఫ్ఘాన్-పాక్ సరిహద్దుల్లో మళ్లీ ఉద్రిక్తతలు

**మన చౌరాస్తా, హైదరాబాద్ :** పాకిస్తాన్ మరియు అఫ్ఘానిస్తాన్ మధ్య సరిహద్దు ప్రాంతాల్లో ఇటీవల మళ్లీ ఉద్రిక్తతలు పెరిగాయి. రెండు దేశాల మధ్య సీమా వివాదాలు ఎప్పటికీ ఉండే అవకాశం ఉన్నప్పటికీ, ఇటువంటి ఘటనలు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పుగా మారుతున్నాయి. ఈ ఉద్రిక్తతలు రెండు దేశాల మధ్య ఉండే భౌగోళిక, రాజకీయ సంబంధాల నేపథ్యంలో మరింత తీవ్రత కలిగించుతున్నాయి. ప్రజల జీవితాలు మరియు ఆర్థిక కార్యకలాపాలు ఈ ఘర్షణల వల్ల గణనీయంగా ప్రభావితమవుతున్నాయి. ఇటువంటి సంఘటనలు ప్రపంచ దృష్టిని ఈ ప్రాంతంపై మళ్లీ ఆకర్షిస్తున్నాయి. నిన్న రాత్రి స్పిన్ బోల్డక్ జిల్లాలో పాకిస్తాన్ దళాలు అఫ్ఘానిస్తాన్ సైన్యంపై దాడులు చేశాయని అఫ్ఘాన్ అధికారులు ఆరోపించారు. ఈ దాడుల వల్ల స్థానికులు భయభ్రాంతులతో ఇళ్ల నుంచి బయటకు పరిగెత్తారు. అఫ్ఘాన్ సైన్యం తమ రక్షణ కోసం తగిన చర్యలు తీసుకుందని, ఈ ఘటనలో కొంతమంది గాయపడ్డారని అధికారికవర్గాలు తెలిపాయి. పాకిస్తాన్ వైపు చమన్ సరిహద్దులో అఫ్ఘాన్ దళాలు ముందుగా కాల్పులు జరిపాయని మరో వైపు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ పరస్పర ఆరోపణలు రెండు దేశాల మధ్య విశ్వాస లోపాన్ని మరింత లోతుగా చేస్తున్నాయి. ఈ ఘటనలు రెండు దేశాల మధ్య ఇటీవల జరిగిన శాంతి చర్చలు ఫలవంతం కాకపోవడం వల్లే జరిగాయని



నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శాంతి చర్చలు పురోగతి లేకుండా ముగిసిన నేపథ్యంలో, సరిహద్దు దాడులు మరింత తీవ్రమవుతున్నాయి. ఈ చర్చల్లో సరిహద్దు రక్షణ, వలసలు, మరియు ఉగ్రవాద వ్యవహారాలు ముఖ్య అంశాలుగా చర్చించబడ్డాయి. అయితే, రెండు వైపులా వాటికి ఏకాభిప్రాయం ఏర్పడలేదు. ఇటువంటి చర్చల అవసరం మరింత పెరిగిన ఈ సమయంలో, అంతర్జాతీయ మధ్యవర్తిత్వం అవసరమవుతోందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.



## నితీశ్‌కు అభినందన లేఖ పంపిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ

**మన చౌరాస్తా, పాట్నా :** బీహార్ ముఖ్యమంత్రి, జనతాదళ్ అధినేత నితీశ్ కుమార్ అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో, ఆయన పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించి, తమ జాబితాలో చేర్చింది. ఈ మేరకు సదరు సంస్థ నితీశ్ కుమార్‌కు ప్రత్యేకంగా అభినందన లేఖను పంపింది.ఒకే వ్యక్తి ఒక రాష్ట్రాన్ని పదిసార్లు పాలించడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే అరుదైన ఘనత అని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తన లేఖలో పేర్కొంది. ''1947 నుంచి 2025 మధ్య కాలంలో పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తొలి వ్యక్తిగా నిలవడం భారతదేశానికి గర్వకారణం. ఇది మీ అంకితభావానికి, దార్శనిక నాయకత్వానికి నిదర్శనం. బీహార్ ప్రజలు మీపై ఉంచిన విశ్వాసానికి ఈ అసాధారణ విజయం తార్కాణం'' అని ప్రశంసించింది.సుపరిపాలన, అభివృద్ధి, సామాజిక సంక్షేమం కోసం నితీశ్ కుమార్ చేస్తున్న కృషి ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని ఆ సంస్థ కొనియాడింది. ఆయన నాయకత్వ పటిమ వల్లే పదేపదే ప్రజల మన్ననలు పొందుతున్నారని వివరించింది. ఈ అరుదైన గౌరవం దక్కడంతో నితీశ్ కుమార్‌కు పలువురి నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.




## మస్క్ 'ఎక్స్'పై భారీ జరిమానా విధించిన ఇయు

**మన చౌరాస్తా, హైదరాబాద్ :** ఎలన్ మస్క్‌కి చెందిన సోషల్ మీడియా 'ఎక్స్'పై యూరోపియన్ యూనియన్ (ఇయు) నియంత్రణ సంస్థ భారీ జరిమానా విధించింది. సోషల్ మీడియా చట్టాన్ని ఉల్లంఘించినందున 120 మిలియన్ యూరోలు(సుమారు 12వేలకోట్లకు పైగా) జరిమానా విధించినట్లు ఇయు శుక్రవారం తెలిపింది. 27 దేశాల కూటమికి చెందిన డిజిటల్ సర్వీసెస్ చట్టం ప్రకారం రెండేళ్ల క్రితం దర్యాప్తు ప్రారంభించిన యూరోపియన కమిషన్ నేడు తన తీర్పు వెల్లడించింది. డిఎస్ఎ చట్టంను అనుసరించి ఎక్స్ మూడు వేర్వేరు ఉల్లంఘనలకు పాల్పడినందున జరిమానా విధించినట్లు యూరోపియన్ కమిషన్ తెలిపింది.డిజిటల్ సర్వీస్ యాక్ట్ (డిఎస్ఎ) ప్రకారం.. యూరోపియన్ వినియోగదారులకు భద్రత కల్పించడం, సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లకు భారీ జరిమానా విధిస్తామనే బెదిరింపులతో సహా వినియోగదారుల ప్లాట్ ఫామ్‌లలో హానికరమైన లేదా చట్టవిరుద్ధమైన కంటెంట్, వాటి ఉత్పత్తులను తొలగించేందుకు బాధ్యత వహిస్తుంది. ఎక్స్ నీలిరంగు చెక్ మార్కులు వాటి మోసపూరిత డిజైన్ నిబంధనలను ఉల్లంఘించాయని, ఇది వినియోగదారులను మోసగిస్తోందని, తారుమారు చేస్తుందని ఇయు తెలిపింది. ఎక్స్ ప్రకటన డేటా బేస్ అవసరాలను కూడా తీర్చలేకపోయిందని, పరిశోధకుల పబ్లిక్ డేటాను యాక్సెస్ చేసేందుకు వీలు కల్పించిందని ప్రకటించింది.

## ప్రధాని మోదీతో తనది సన్నిహిత వ్యక్తిగత సంబంధం అని వెల్లడి

**మన చౌరాస్తా, హైదరాబాద్ :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల భారత పర్యటన ఫలవంతంగా ముగిసింది. శుక్రవారం సాయంత్రం ఢిల్లీ నుంచి తిరుగుపయనం అయ్యే ముందు, తాను బస చేసిన హోటల్‌లోని సిబ్బందితో ఆయన ఫోటో దిగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ అరుదైన దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. హోటల్ సిబ్బంది అభ్యర్థనను మన్నించి, వారితో కలిసి పుతిన్ గ్రూప్ ఫోటోకు నవ్వుతూ ఫోజులివ్వడం విశేషం. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను రష్యాకు చెందిన ఓ జర్నలిస్ట్ తన టెలిగ్రామ్ ఛానల్‌లో పోస్ట్ చేయగా, దీనిపై రష్యా అధికారిక వార్తా సంస్థ 'టాస్' ఒక కథనాన్ని ప్రచురించింది. ఫోటో సెషన్ ముగిసిన తర్వాత సిబ్బంది కృతజ్ఞతలు తెలుపగా, పుతిన్ వారికి చిరునవ్వుతో వీడ్కోలు పలికారు. అనంతరం సిబ్బంది తాము దిగిన ఫోటోలను కెమెరాల్లో ఎంతో ఆసక్తిగా చూసుకున్నారు.పర్యటనలో భాగంగా పుతిన్, భారత ప్రధాని నరేంద్ర మోదీతో విస్తృత స్థాయి చర్చలు జరిపారు. హైదరాబాద్ హౌస్‌లో జరిగిన 23వ భారత్‌రష్యా వార్షిక సదస్సులో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై లోతుగా చర్చించారు. చర్చల అనంతరం పుతిన్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీతో తనకు అత్యంత సన్నిహితమైన, వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయని తెలిపారు.''భారత ప్రతినిధులతో జరిపిన చర్చలు చాలా ఫలవంతంగా, స్నేహపూర్వక వాతావరణంలో జరిగాయి. అంతకుముందు రోజు రాత్రి ప్రధాని మోదీ తన నివాసంలో ఇచ్చిన విందులో ఏకాంతంగా సమావేశమయ్యాం. ఆ ఆత్మీయతకు నేను మరోసారి ధన్యవాదాలు తెలుపుతున్నాను. మా చర్చలు భారత్‌రష్యా మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించాయి'' అని పుతిన్ వ్యాఖ్యానించారు.ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన ఎస్ సీవో సదస్సులో కూడా మోదీతో సమావేశమయ్యామని, తాము తరచుగా ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఉంటామని పుతిన్ తెలిపారు.





## అటువంటి వ్యాఖ్యలు తగవు!

**మన చౌరాస్తా, న్యూఢిల్లీ :** రోహింగ్యాల గురించి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయ నిపుణులు చీఫ్ జస్టిస్‌కు ఒక బహిరంగ లేఖ రాశారు. రోహింగ్యా శరణార్థులు కొంతమంది భారత్‌లో పోలీసుల కస్టడీలో వుండగా అదృశ్యమవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ దాఖలైన హక్కుల కార్యకర్త రీటా మన్‌చందా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సిజెఐ వ్యాఖ్యలు చేశారు. రోహింగ్యా శరణార్థుల హోదాను జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. 'దేశంలోకి చట్ట విరుద్ధంగా చొరబడిన వారికి రెడ్ కార్పెట్ పరవాలా?' అంటూ వ్యాఖ్యలు చేశారు. ''హింస, వేధింపులను భరించలేక పారిపోతున్న వారిపై వారి గౌరవానికి విరుద్ధమైన రీతిలో వ్యాఖ్యలు చేయడం మన రాజ్యాంగ ప్రాథమిక విలువలకు ముప్పుగా పరిణమిస్తాయి. పైగా ఆశ్రయం కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించడం పట్ల ప్రజలకు గల నమ్మకం కూడా దెబ్బతింటుంది.'' అని ఆ లేఖలో న్యాయ నిపుణులు పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో, జ్యుడీషియల్ తీర్పుల్లో వ్యాఖ్యలు చేసేటప్పుడు, అలాగే బహిరంగంగా ప్రకటనలు చేసేటప్పుడు మూలాలతో నిమిత్తం లేకుండా అందరి పట్ల న్యాయం, గౌరవం ప్రాతిపదికకు, రాజ్యాంగ నైతికతకు కట్టుబడాలని ఆ లేఖలో వారు పునరుద్ఘాటించారు. 'మీరెన్ని తీర్పులు ఇచ్చారు, లేదా పాలనాపరమైన చర్యలేం తీసుకున్నారనే దానిపై సుప్రీంకోర్టు, మీ కార్యాలయం ఘనత, గౌరవం ఆధారపడదు, మీరెంత మానవీయతతో తీర్పులు ఇచ్చారనేదే పరిగణనలోకి వస్తుంది.' అని జస్టిస్ సూర్యకాంత్‌ను ఉద్దేశిస్తూ ఆ లేఖ పేర్కొంది. పేదలు, సమాజంలో వెనుకబడినవారు, అణచివేతకు గురయ్యేవారి హక్కుల సంరక్షకదారుగా సుప్రీంకోర్టు వ్యవహరించాలని ఆ లేఖ నొక్కిచెప్పింది. ''మీ మాటలు న్యాయస్థానంలోనే కాదు, దేశ ప్రజల మనస్సాక్షిలోనూ ప్రభావం చూపుతాయి. హైకోర్టులు, దిగువ న్యాయస్థానాలు, ఇతర ప్రభుత్వ అధికార యంత్రాంగంపైనా ప్రభావం చూపుతాయని పేర్కొంది. రోహింగ్యాలు భారతదేశంలో నివసించే మరే ఇతర వ్యక్తిలానే 21వ అధికరణ కింద అన్ని రక్షణలకూ అర్హులు. ఈ ప్రాథమిక హక్కు దేశ పౌరుడికే కాదు, ఈ దేశంలో నివసించే ఎవరికైనా అందుబాటులో వుంటుందని ఆ లేఖ పేర్కొంది. దేశభద్రతా ప్రయోజనాలను, పౌరుల ఆందోళనలను గమనంలోకి తీసుకుంటూనే వివిధ ప్రాంతాలకు చెందిన శరణార్థులకు ఆశ్రయం ఇవ్వడం, వారికి మానవతాపరమైన రక్షణ కల్పించిన రికార్డు భారతదేశానికి వుందని ఆ లేఖ గుర్తు చేసింది. టిబెటన్లు, శ్రీలంక జాతీయులకు ప్రత్యేక పత్రాలు జారీచేసిన ప్రభుత్వం వారిని శరణార్థులుగా గుర్తించిందని, వారికి మౌలిక సామాజిక, ఆర్థిక హక్కులు కూడా కల్పించిందని గుర్తు చేశారు.

## నటుడు విజయ్‌తో కాంగ్రెస్ నేత ప్రవీణ్ చక్రవర్తి రహస్య భేటీ

**మన చౌరాస్తా, చెన్నై :** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అధికార డీఎంకేతో పొత్తు చర్చలు జరుపుతున్న కాంగ్రెస్ పార్టీ, మరోవైపు నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం పార్టీతో మంతనాలు జరపడం కలకలం రేపుతోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడైన ప్రవీణ్ చక్రవర్తి.. శుక్రవారం చెన్నైలో విజయ్‌తో రహస్యంగా భేటీ అయ్యారు. డీఎంకేతో సీట్ల పంపకంపై కాంగ్రెస్ కమిటీ చర్చలు జరిపిన 48 గంటల్లోనే ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం తమకు 40 స్థానాలు కేటాయించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. అయితే, 20 నుంచి 25 సీట్లకు మించి ఇచ్చేందుకు డీఎంకే అధినేత, సీఎం



ఎంకే స్టాలిన్ సుముఖంగా లేరని సమాచారం. ఈ నేపథ్యంలో డీఎంకేపై ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగానే కాంగ్రెస్ ఈ భేటీని తెరపైకి తెచ్చిందనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి.చెన్నైలోని టీవీకే కార్యాలయంలో విజయ్, ప్రవీణ్ చక్రవర్తి మధ్య గంటకు పైగా ఈ సమావేశం జరిగింది. అయితే, ఈ భేటీ గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని తమిళనాడు కాంగ్రెస్ నేతలు చెప్పడం గమనార్హం. పార్టీ అధిష్ఠానం అనుమతి లేకుండా ప్రవీణ్ ఈ సమావేశం నిర్వహించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిణామం మిత్రపక్షమైన డీఎంకేలోనూ అసంతృప్తికి కారణమైంది. ఒకవేళ డీఎంకేతో సీట్ల సర్దుబాటు కుదరకపోతే, విజయ్‌తో కలిసి కొత్త కూటమి ఏర్పాటు చేసే అవకాశాలను కూడా కాంగ్రెస్ పరిశీలిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



# సెట్స్‌లో అడుగుపెట్టిన సమంత..!

ఇటీవలే రాజ్ నిడిమోరుతో వివాహ బంధంలో అడుగుపెట్టిన సమంత రూత్ ప్రభు.. పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ అడుగుపెట్టింది. తన బ్యానర్ లో స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాపై ఫోకస్ పెట్టింది. క్రైమ్ థ్రిల్లర్ గా వస్తున్న ఈ సినిమాపై అప్పడే అంచనాలు పెరిగిపోయాయి. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సమంత భర్త రాజ్ నిడిమోరు ఈ సినిమాకి కో-ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నాడు. సమంత రూత్ ప్రభు ఇటీవలే దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 1వ తేదీల తెల్లారుజామున వీరి వివాహం జరిగింది. కొత్త జీవితం ప్రారంభించిన సామ్.. కొన్ని రోజులు సినిమా షూటింగులకు బ్రేక్ తీసుకుంటుందని అభిమానులు భావించారు. అయితే సమంత పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ లో అడుగుపెట్టింది. ఈ విషయాన్ని డైరెక్టర్ నందిని రెడ్డి సోషల్ మీడియాలో వెల్లడిరచింది. సమంత స్వీయ నిర్మాణంలో ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. నందిని రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో సామ్ తో పాటుగా గుల్షన్ దేవయ్య, దిగంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దసరా పండక్కి ఈ సినిమాని పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. తాజాగా సామ్ తిరిగి షూటింగ్‌లో జాయిన్ అయినట్లు నందిని రెడ్డి ఇంస్టాగ్రామ్ లో పోస్ట్ పెట్టింది. ఒక ఫొటోని షేర్ చేసింది.

ఇంతకుముందు మహానటి కీర్తి సురేష్ కూడా ఇలానే కాళ్ల పారాణి ఆరకముందే సినిమా పనుల్లో బిజీ అయింది. మోడ్రన్ డ్రెస్సులు, మెడలో పసుపు తాడుతో 'బేబీ జాన్' మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొంది. ఇప్పుడు సమంత సైతం పెళ్లి చేసుకున్న కొన్ని రోజులకే షూటింగ్ లో అడుగుపెట్టింది. తన బ్యానర్ లో రూపొందుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాని వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే టార్గెట్ పెట్టుకున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం సామ్ - గుల్షన్ దేవయ్య పాల్గొనే కొన్ని కీలక సన్నివేశాలు షూట్ చేస్తున్నట్లు సమాచారం. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థ ప్రారంభించి సమంత.. తొలి ప్రయత్నంగా 'శుభం' అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ ప్రాజెక్ట్ లో రాజ్ నిడిమోరు కూడా భాగం పంచుకున్నాడు. ఇప్పుడు అదే బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.2గా 'మా ఇంటి బంగారం' చిత్రం తెరకెక్కుతోంది. దీనికి రాజ్ కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. 'ఓ బేబి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సమంత, నందినీ రెడ్డి కలిసి చేస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడిరది. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో గ్రిప్పింగ్ యాక్షన్ డ్రామాగా 'మా ఇంటి బంగారం' రూపొందుతోందని ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి సీతా మీనన్, వసంత్ మరిన్‌గంటి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తుండగా.. సంతోష్ నారాయణన్ సంగీతం సమకూరుస్తున్నారు. ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సమంత ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంది.

Printed, Published by **UPPALANCHI POORNIMA**, On behalf of UPPALANCHI POORNIMA, Printed at HAMARA WARANGAL Printers &Graphics, # 25-8-182, Babujinagar, Kazipet, Warangal - 506003 and Published from # 4-8-65, Dharmakancha, Jangon, Warangal-506167, Editor : **UPPALANCHI NARENDER**, email : manachourasta@gmail.com, Ph : **8555800812**, PRGI No. TGTEL/25/A4350